ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జూన్ 2019

సంపుటి : 25 **294** సంచిక : 6

కృతం కర్మ శుభా శుభమ్!

సుఖమూ దుఃఖమూ మనం కోరుకునేవి కావు. మనం కోరుకున్నప్పుడు రావు. కర్మ విపాకంలో వస్తాయ్. పూర్వ జన్మ సంచితమైన పాపపుణ్యాలు కూడా కారణమవుతాయ్

జన్మ దుఃఖం, జరా దుఃఖమ్ అన్నారు. అసలు జన్మించడంలోనే ఒక దుఃఖ పరిణామముంది. దుర్భరమున్నది. గర్భావసాత్వరో నరకో భువనత్రయ్! అన్నారు. అసలు పిండోత్పత్తి అయినది మొదలు, మాతృగర్భంలో పదినెలల సంకెళ్లు వేసిన ఖైదీలా ఉండడమే ఒక శిక్ష. జఠరాగ్ని, రక్తమాంసాల మధ్య మలమూత్ర విసర్జనా మార్గానికి చేరువగా ఉండడం, ఆకలి దప్పికలను అక్కడ తీర్చుకుంటూ, సమయ మాసన్నమైనపుడు మర్మా అవయవం ద్వారా తాను నలిగి పిగిలితూ, మాతృగర్భాన్ని వేధిస్తూ రావడము, తాను ఏడవడం, అంతకు ముందూ ఆమెను ఏడిపించడం ఎంత కర్మం.

ఇలా మలినేంద్రియాల ద్వారా పుట్టిన జీవుడు కామక్రోధాలకు దాసత్వం కలిగి ఉంటాడు. మానవ దేహం ధరించిన వీరికి ధర్మం పట్ల స్థిర చిత్తం ఉండదు. బ్రహ్మాదిస్తంబు పర్యంతమూ గల విశ్వం మాయా మోహితమ్. సత్యమే మోసంగా, మోసమే సత్యంగా మరలుతూంటుంది. ఇది సమ్మిశ్రితమైన సనాతనం.

ఇహ మానవదేహం ధరించే గుణాలు చిత్రవిచిత్ర భిన్న విభిన్న సంశోభితాలు.

ఆకలి, దప్పిక, నిద్ర, భయం, శోకం, వ్యామోహం, సంశయం, హర్షం, అభిమానం, వార్ధక్యం, అజ్ఞానం, గ్లాని, అప్రియం, ఈర్ష్య, అసూయ, క్రోధం, మతం, శ్రమ ఆదిగా గల రుగ్మతలతో అహరమూ అవిశ్రాంతంగా కొట్టుమిట్టు లాడుతూ ఉంటుంది.

రాగద్వేష విదగ్ధానాం విషపాయినామ్
చికిత్సా ధర్మ శాస్త్రాణి వ్యాధీనామివ భేషజమ్

–రాగ ద్వేషాదులతో బాధపడువారు, అజ్ఞానమను విషము నాస్వాదించు వారికి, వ్యాధులచే బాధపడువారికీ ధర్మశాస్త్రము ఔషధమువలె పనిచేస్తుందంటారు.

మా తరం వారికందరికీ అప్పటి పాఠ్యాంశముల్లో నీతి శతక పద్యములు, పురాణేతిహాస ధర్మశాస్త్ర విషయములను బోధించేవారు, ఇంటివద్ద అమ్మ రామాయణ, భారత, భాగవత గాథలనూ, పద్యాలను వినిపిస్తూండేది. ఇప్పుడవేవీ లేవు. పోనీ పాఠ్యగ్రంథాలేమైనా తక్కువగా ఉన్నాయా యంటే రెండో తరగతి నుంచీ గాడిద మోసినట్లు (గాడిద బరువు) పుస్తకాలు, పిల్లలకు గూని వస్తూందేమోననిపిస్తుంది. నీతి ధర్మ బోధకరమైన పాఠ్యాంశాలు గానీ, పూర్వపు త్యాగమూర్తుల చరితలు బోధించుట కానీ లేదు.

ధర్మః కృతః శ్రుతో దృష్టః కథితశ్చింతితోఽపివా
తథాఽను మోది తశ్చాపి పుష్టాతి పరమం శుభమ్

– చందాన ధర్మమును ఆచరించుట, లేదా వినుట, లేదా చెప్పుట, చింతించుట వలన చిత్తమున శాంతి ప్రబలును. సుఖ సంతోషములు సిద్ధించును. అంతరంగంలో నిరంతరమూ దైవీ గుణాలూ, అసుర శక్తులూ ప్రబలుతూనే ఉన్నాయ్. వాటిమధ్య సంఘర్షణ జరుగుతున్నట్లే సుఖదుఃఖాలు పరస్పరమూ దోబూచులాడినట్లు ఒకటి వెనుక మరొకటి వస్తూనే ఉంటాయ్. ఇది తెలియక సుఖం కలిగినపుడు భగవంతుడు అనుగ్రహించాడనీ, దుఃఖం కలిగినపుడు భగవదానుకూలత లేకపోయిందనీ భావించడం సహజం. కృష్ణపక్షంలో రోజురోజుకూ క్షీణించిన చంద్రుడు శుక్లపక్షంలో రోజురోజుకూ వృద్ధి పొందినట్లే దుఃఖములు వెనుక సుఖములు కలుగుతాయని, తలచిననాడు జీవితం అర్థవంతంగా సాగుతుంది. కానీ మనం అలా భావించలేమే! వాసనకల గంధపు చెక్కలను మోస్తున్న గార్ధభములా జీవిత మనుగడను సాగింప చేస్తున్నాం.

సంసారంలో బందీయైన మహిళగానీ, మగవాడుగానీ, సతతమూ సుఖమునే వాంఛిస్తాడు. కలయికనందే సుఖము ఉంటుంది. ఒంటరిగా ఉన్న ఎవరికీ సుఖం లభించదు. ఒకపరి దుఃఖము కలిగిననూ ఇరువురూ పంచుకోవడంతో భారము తగ్గుతుంది. అలా చేయగలుగుతున్నామా? ఒకరినొకరు నీవు కారణం నీవు కారణం అంటూ నిందించుకుంటున్నాం.

విచిత్రమేమంటే సరస దయా గుణంబులు కలవాడు తాను ఎక్కువ బాధలతో నలిగి పిగులుచున్నప్పటికినీ, గుండె నిబ్బరము చేసుకుని, తన్నుచేరవచ్చినవారికి ఓదార్పు కలిగిస్తూంటాడట. ఈ విషయాన్నే భాస్కర శతకంలో కడు చక్కగా వివరించారు.

సరస దయా గుణంబుగల జాణ మహింగడునొచ్చి యుండియుం
దరచుగ వానకాసబడి దాయంగ వత్తురు లోకులెట్ల సం
జెరకు రసంబు గానుగను జిప్పిలిపోయిన మీద బిప్పియై
ధరబడయున్న జేరవె ముదంబున చీమలు పెక్కు భాస్కరా.

–చెరకు గెడయందలి రసమంతయు కారిపోవునట్లు గాను యాడించిననంతరము నేలపై బడియున్న ఆ పిప్పిపై అనేకములైన చిరుచీమలు వచ్చి చేరుతాయట– అలాగే దయాగుణము కలవారు చితికి బాధలు పడుచున్ననూ జనులు చేరుచుందురనెడిది ఈ భాస్కర పద్య సారంశం.



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

(సెప్టెంబర్ 2007 ప్రముఖాంధ్ర)

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com
YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-

భేతాళ కథలలో విక్రమార్కుడు ఎందుకు పట్టు వదలలేదు ?

"పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు తిరిగి వెళ్లి, చెట్టు నుంచి శవాన్ని దించి భుజాన వేసుకొని ఎప్పటిలాగే మౌనంగా శ్మశానంకేసి నడవసాగాడు. అప్పుడు శవ రూపంలోని భేతాళుడు రాజా... అచంచలమైన నీ దీక్ష ప్రశంసించదగినదే... కానీ ఎందుకీ పట్టుదల అని అడిగినప్పుడు నువ్వు వహించే మౌనం మాత్రం నాకు నిగూఢంగా ఉన్నది. నన్ను మోస్తున్న నీకు శ్రమ తెలియకుండా ఉండటానికి ఒక కథ చెబుతాను విను..."

ఎన్ని భేతాళకథలు చదివినా ప్రారంభం ఇదే. కథ మొదలవ్వడంతోనే విక్రమార్కుడు భేతాళున్ని భుజాన వేసుకొని నడవటంతో ప్రారంభమౌతుంది. ఇంతకీ విక్రమార్కుడు ఎవరు? భేతాళుడికి అతనికి సంబంధం ఏంటి? అసలు 'విక్రమార్క–భేతాళ' కథలకు ప్రారంభం ఏంటి... మరుగున పడ్డ ఆ మూల కథ ఏంటి?

'భేతాళ కథల' ఆధారంగా మూలాలను శోధిస్తే...

భేతాళకథలను రచించింది గుణాఢ్యుడు. ఈ కథ మొత్తం ఉజ్జయినీ రాజ్యంలో జరిగినట్టు గుణాఢ్యుడి సంకలనం ప్రకారం తెలుస్తోంది. ఉజ్జయిని సామ్రాజ్య పాలకుడు విక్రమార్కుడు. ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకొని పరిపాలించేవాడు. తన పరిపాలనదక్షతతో కాళీమాతను ప్రసన్నం చేసుకొంటాడు విక్రమార్కుడు. విక్రమార్కుడి వంటి భూపాలుడు చిరకాలం ధరిత్రిని పాలించాలని, వెయ్యి సంవత్సరాల పాటు పాలించే వరాన్ని అనుగ్రహిస్తుంది ఆమె.

విక్రమార్కుని మంత్రి భట్టి. ఇతడు విక్రమార్కుడి సోదరుడు కూడా. భట్టి తెలివితేటలతో రాజుగా విక్రముడి ఆయుష్షును రెండువేల సంవత్సరాలకు పెంచుతాడు. భట్టి యుక్తితో విక్రమార్కుడు ఆరునెలలు రాజ్యపాలన, ఆరు నెలల దేశ సంచారం చేసి ప్రజల కష్టసుఖాలను తెలుసుకొనేవాడు. ఇది విక్రమార్కుడి నేపథ్యం.

ఉజ్జయినికి కొంతదూరంలో ఒక సన్యాసి ఘోర తపస్సు చేస్తుంటాడు. కఠోర దీక్షతో అతడు దేవీ అనుగ్రహాన్ని సంపాదిస్తాడు. లోకంలోని రాజులంతా తనకు సామంతులవ్వాలనేది అతని కోరిక. చావు లేకుండా తలచిందల్లా జరిగేటట్లుగా చూడమని ఆమెను కోరతాడు. కాళికామాత అతని దురాశను మన్నిస్తూ భూత ప్రేతాదులకు అధిపతి అయిన భేతాళున్ని వశం చేసుకొంటే నీ కోరిక తీరుతుందని చెబుతుంది. భేతాళున్ని వశం చేసుకోవడానికి వందమంది రాజకుమారులను యజ్ఞంలో బలి ఇచ్చి తనకు సంతుష్టి కలిగించమంటుంది. వారిలో వందో వాడు బహుపరాక్రమవంతుడై ఉండాలని కాళిక చెబుతుంది. ఆ సన్యాసి హోమం ప్రారంభించి మాయ మాటలతో రాజకుమారులను భద్రకాళి ఆలయానికి తీసుకొచ్చి బలిస్తుంటూ ఉంటాడు. అలా 99 మంది పూర్తవుతారు. వందోవాడి అన్వేషణలో ఉన్న సన్యాసికి విక్రమార్కుడి గురించి తెలుస్తుంది.

విక్రమార్కుడి గురించి తెలుసుకొన్న మాంత్రికుడు ఉజ్జయినికి మకాం మారుస్తాడు. దేశ సౌభాగ్యం కోసం తాను యాగం చేస్తున్నానని దానికి ఒక వీరుడి సహాయం అవసరమని, తమ నుంచి ఆ సాయం ఆశిస్తున్నానని విక్రమార్కు డిని కోరతాడు. సన్యాసికి అభయం ఇస్తాడు విక్రమార్కుడు. తన యాగం పూర్తవ్వాలంటే భూత ప్రేతాలకు నిలయమైన మర్రిచెట్టుపై శవాకారంలో ఉన్న భేతాళున్ని హోమం వద్దకు తీసుకురావాలని సన్యాసి కోరతాడు. దీనికి విక్రమార్కుడు సమ్మతిస్తాడు. భేతాళుడిని తీసుకెళ్లడానికి వచ్చిన విక్రమార్కుడిని చూసి మర్రి చుట్టూ ఉన్న భూతప్రేతాలన్నీ యుద్ధం మొదలు పెడతాయి. వాటి నుంచి ఎంత పోరాటం ఎదురైనా పట్టువదలకుండా చెట్టుపై ఉన్న భేతాళుడిని భుజాలపై వేసుకొంటాడు...

ఇది భేతాళుడి కథ...

శాపవశాత్తూ భేతాళుడు శవ రూపంలో చెట్టుపై ఉండిపోతాడు. ఇతడు పూర్వ జన్మలో తపఃసంపన్నుడైన బ్రాహ్మణుడు. కైలాసంలో మహాశివుడిని పార్వతీదేవి ఒక కోరిక కోరుతుందట. తనకు కథలు చెప్పమని, అవి ఇంతవరకూ ఎవరికీ తెలియనివి, ఎవరికీ ఎవరూ చెప్పుకోనివి అయ్యుండాలని పార్వతీ దేవి తన నాథుడిని కోరుతుంది. తన సఖి కోరిక మేరకు అద్భుతమైన కొన్ని కథలను చెబుతాడు మహాశివుడు. పార్వతీ పరమేశ్వరుల ఈ సంవాదాన్ని చాటుగా వింటాడు ఆ బ్రహ్మణుడు. ఎంతో ఉత్కంఠతను కలిగించే ఆ అద్భుతమైన కథలను విన్న బ్రాహ్మణుడు తీవ్ర ఉద్వేగానికి గురవుతాడు. ఆ కథలను తన మనసులోనే దాచుకోలేక వెంటనే తన భార్యకు చెప్పేస్తాడు. ఎవరికీ చెప్పకు అనే షరతు కూడా పెడతాడు. అయితే ఆమె బ్రాహ్మణుడి వలే తాళలేక తన తోటి మహిళలందరికీ చెప్పేస్తుంది. వారి నుంచి అనేక మందిలో ఈ కథలకు ప్రాచుర్యం వస్తుంది.

ఆ తర్వాత ఆ నోట ఈ నోట పడిన ఈ కథలు చివరకు పార్వతీ దేవి చెవిన పడతాయి. పరమశివుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుందామె. భూలోకంలో ప్రాచుర్యం పొందిన కథలను తనకు చెప్పి అవమానించావని శివుడిని నిందిస్తుంది. ఎక్కడ పొరపాటు జరిగిందో సమీక్షించిన శివుడు బ్రాహ్మణుడి వృత్తాంతాన్ని గ్రహిస్తాడు. తమ ఏకాంత సంవాదాన్ని విన్నాడనే కోపంతో, విన్న కథలను ఒక మేధావికి చెప్పి చిక్కు ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకొనే వరకూ భేతాళుడిగా ఉండిపొమ్మని శపిస్తాడు. అలా బ్రాహ్మణుడు భేతాళుడిగా మారి విక్రమార్కుడి కోసం ఎదురు చూస్తుంటాడు. తనను గుహలోని మాంత్రికుడి వద్దకు తీసుకెళ్లడానికి విక్రమార్కుడు భుజం మీద వేసుకోగానే... 'రాజా నీకు శ్రమ తెలీకుండా ఒక కథ చెబుతాను, ఆలకించి నా సందేహాన్ని నివారించు.

నీకు తెలీకపోతే సమాధానం ఇవ్వనక్కరలేదు కానీ, తెలిసీ సమాధానమీయక పోతే నీ తల పగిలి నూరు వక్కలవుతుంది' అనే హెచ్చరికతో కథలు మొదలు పెడతాడు. ఇక్కడ మరో షరతు ఉంది. మాంత్రికుడి కోరిక మేరకు భేతాళుడిని భుజం మీద వేసుకొన్నాక విక్రమార్కుడు మౌనంగా ఉంటేనే ఆ శవాన్ని గుహ వద్దకు చేర్చగలడు. అయితే భేతాళుడు అడిగే ప్రతి చిక్కు ప్రశ్నకు విక్రమార్కుడు సమాధానం చెప్పగలడు. దాంతో నోరు తెరవక తప్పదు. దీన్నే అవకాశంగా తీసుకొన్న భేతాళుడు తనకు శాపంగా ఉన్న కథలన్నింటినీ విక్రమార్కుడి చెప్పేస్తాడు. అంతేగాక మాంత్రికుడి నిజ స్వరూపం తెలిసింది భేతాళుడికి మాత్రమే.

యజ్ఞంలో బలి ఇచ్చి తనకు సంతుష్టి కలిగించమంటుంది. వారిలో వందో వాడు బహుపరాక్రమంతుడై ఉండాలని కాళిక చెబుతుంది. ఆ సన్యాసి హోమం ప్రారంభించి మాయమాటలతో రాజకుమారులను భద్రకాళి ఆలయానికి తీసుకొచ్చి బలిస్తుంటూ ఉంటాడు. అలా 99 మంది పూర్తవుతారు. వందోవాడి అన్వేషణలో ఉన్న సన్యాసికి విక్రమార్కుడి గురించి తెలుస్తుంది.

ఒక రాత్రిలోనే!

విక్రమార్కుడి కథల్లోని భేతాళుడు చాలా మంచి వాడు. మహారాజు సాహసంతో మురిసిపోయే భేతాళుడు విక్రమార్కుడు తనను తీసుకొని సన్యాసి దగ్గరకు వెళితే, అతడు రాజుని బలిస్తాడని భేతాళుడికి తెలుసు. గుణాఢ్యుడు రాసిన బృహత్‌కథల ప్రకారం భేతాళ, విక్రమార్కుల సంవాదం అంతా ఒక రాత్రి జరిగినదే! మొత్తం భేతాళుడు 25 కథలను విక్రమార్కుడికి చెబుతాడు. అన్ని కథల చిక్కు ప్రశ్నలకు సమాధానం చెప్పిన విక్రమార్కుడు చివరకు ఒక కథ విషయంలో ఓడిపోతాడు. విక్రమార్కుడు సమాధానం చెప్పలేని ఆ కథ గుణాఢ్యుడు సంకలనంలో అలభ్యం అని పెద్దలు అంటారు. చివరి కథలో ప్రశ్నకు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్న విక్రమార్కుడికి భేతాళుడే హితబోధ చేస్తాడు. సన్యాసి క్రూర త్వం గురించి వివరిస్తాడు. హోమం వద్దకు చేరుకొన్న తర్వాత విక్రమార్కుడే సన్యాసిని కాళికకు బలిస్తాడు. ఆ తర్వాత భట్టి, భేతాళుల సాయంతో కాళికాదేవి ఆశీస్సులతో రెండువేల యేళ్లు ఉజ్జయిని పాలించి స్వర్గారోహణం చేస్తాడు విక్రమార్కుడు. ●

మన చిన్నతనంలో చదువుకున్న, ఆడుకున్న, పాడుకున్న, నేర్చుకున్న ఈ పాటలు మరల మీ కోసం

చిట్టి చిలకమ్మా – అమ్మ కొట్టిందా
తోటకెల్లావా – పండు తెచ్చావా
గూట్లో పెట్టావా – గుటుక్కున మింగావా

✧ ✧ ✧

చెమ్మ చెక్క – చేరడేసి మొగ్గ
అట్లు పోయంగా – ఆరగించంగ
ముత్యాల చెమ్మ చెక్క – ముగ్గులెయ్యంగ
రత్నాల చెమ్మ చెక్క – రంగులెయ్యంగ
పగడాల చెమ్మచెక్క – పందిరెయ్యంగ
పందిట్లో మా బావ – పెళ్ళి చెయ్యంగ
సుబ్బారాయుడు పెండ్లి – చూచి వద్దాం రండి
మా వాళ్ళింట్లో పెండ్లి – మళ్ళీ వద్దాం రండి.

✧ ✧ ✧

ఒప్పులకుప్పా – ఒయ్యారి భామా
సన్నా బియ్యం – చాయపప్పు
భావిలో కప్పా – చేతిలో చిప్పా
రోట్లో తవుడు – నీ మొగుడెవరు ?
గూట్లో రూపాయ్ – నీ మొగుడు సిపాయ్.

✧ ✧ ✧

చేత వెన్న ముద్ద – చెంగల్వ పూదండ
బంగారు మొలత్రాడు – పట్టుదట్టి
సందిట తాయత్తులు – సిరిమువ్వ గజ్జెలు
చిన్ని కృష్ణా నిన్ను – చేరి కొలుతు.

✧ ✧ ✧

చుక్ చుక్ రైలు
చుక్ చుక్ రైలు వస్తోంది
దూరం దూరం జరగండి
ఆగి నాక ఎక్కండి
జోజో పాపా ఏడవకు
లడ్డు మిఠాయ్ తినిపిస్తా
చల్లని పాలు తాగిస్తా

✧ ✧ ✧

బావా బావా పన్నీరు
బావను పట్టుకు తన్నేరు
వీధీ వీధీ తిప్పేరు
వీసెడు గంధం పూసేరు
పట్టే మంచం వేసేరు
పాతిక గుద్దులు గుద్దేరు
నులక మంచం వేసేరు
నూరు గుద్దులు గుద్దేరు
బావా బావా పన్నీరు
బావకు మరదలు బంగారు

✧ ✧ ✧

బుజ్జి మేక బుజ్జి మేక ఏడకెల్తివి?
రాజు గారి తోటలోన మేత కెల్తినీ
రాజు గారి తోటలోన ఏమి చూస్తివీ?
రాణి గారి పూలచెట్ల సొగసు చూస్తినీ
పూలచెట్లు చూసి నీవు ఊరకుంటివా?
నోరూరగా పూల చెట్లు మేసివస్తినీ
మేసివస్తే నిన్ను భటులు ఏమిచేసిరి?
భటులు వచ్చి నా కాళ్ళు విరుగగొట్టిరీ
కాలు విరిగిన నీవు ఊరకుంటివా ?
మందుకోసం నేను డాక్టరింటికెల్తినీ
మందు ఇచ్చిన డాక్టరుకు ఏమిస్తివీ?
చిక్కనైన తెల్ల పాలు అందిస్తినీ
ఉన్న పాలు డాక్టరుకిస్తే యజమాని కేమిస్తావూ?
గడ్డి తినక ఒకపూట పస్తులుండి తీరుస్తా.
పస్తులుంటే నీకు నీరసం రాదా?
పాడు పని చేయనింక బుద్ధివచ్చేనాకు.

✧ ✧ ✧

చందమామ రావే జాబిల్లి రావే
కొండెక్కి రావే గోగు పూలు తేవే
చందమామ రావే జాబిల్లి రావే
వెండి గిన్నెలో వేడిబువ్వ తేవే
పైడి గిన్నెలో పాలబువ్వ తేవే
అందాల పాపకు అందిచ్చి పోవే
తెల్ల మబ్బుల తేరు మీద రావే
పాల వెన్నెల పానకాలు తేవే
అందాల పాపకు అందిచ్చి పోవే.

✧ ✧ ✧

బుర్రుపిట్ట బుర్రుపిట్ట తుర్రుమన్నది
పడమటింట కాపురము చెయనన్నది
అత్త తెచ్చిన కొత్తకోక కట్టనన్నది
మామ తెచ్చిన మల్లెమొగ్గె ముడవనన్నది
మొగుని చేత మొట్టికాయ తింటనన్నది.

✧ ✧ ✧

ఏనుగమ్మ! ఏనుగు! నాలుగుకాళ్ళ ఏనుగు
ఏ ఊరొచ్చింది ఏనుగు ? మా ఊరొచ్చింది ఏనుగు
ఏం చేసింది ఏనుగు? నీళ్ళు తాగింది ఏనుగు
ఏనుగు ఏనుగు నల్లన – ఏనుగు కొమ్ములు తెల్లన
ఏనుగు మీద రాముడు – ఎంతో చక్కని దేవుడు

✧ ✧ ✧

బావ బావ పన్నీరు – బావని పట్టుకు తన్నేరు
వీధి వీధి తిప్పేరు – వీసెడు గంధం పూసేరు
చావిడి గుంజకు కట్టేరు – చప్పిడి గుద్దులు గుద్దేరు
కాళ్ళపీట వేసేరు – కడుపులో గుద్దులు గుద్దేరు
పట్టెమంచం వేసేరు – పాతిక గుద్దులు గుద్దేరు
నులక మంచం వేసేరు – నూరు గుద్దులు గుద్దేరు

✧ ✧ ✧

ఆదివారం నాడు అరటి మొలచినది
సోమవారం నాడు సుడి వేసి పెరిగినది
మంగళవారం నాడు మారాకు తొడిగినది
బుధవారం నాడు పొట్టి గెల వేసినది
గురువారం నాడు గుబురులో దాగినది
శుక్రవారం నాడు దాగినది పండినది
శనివారం నాడు చకచకా గెల కోసి
అందరికి పంచితిమి అరటి అత్తములు
అబ్బాయి అమ్మాయి అరటి పండ్లివిగో
అబ్బాయి అమ్మాయి అరటి పండ్లివిగో

అందరూ ఈ పాటలు గుర్తు చేసుకున్నారని తలుస్తాను, పిల్లలకు నేర్పించండి.

- హిందూ ధర్మచక్రం

సుమధురమైన ఎనిమిది గంధాలను కలిపి తయారుచేసేదే అష్టగంధం అని అంటారు. ఆ ఎనిమిది పదార్థాలు ఏమిటంటే ...

1.కస్తూరి, 2.గోరోజనం, 3.కుంకుమ పువ్వు, 4.దేవదారు, 5.పచ్చ కర్పూరం, 6.అగిలు, 7. గంధం, 8.రక్త చందనం,

ఈ ఎనిమిది పదార్థాలతో చేసే గంధం పరమాత్మునుకి ప్రియమైనది. దీన్ని ధరించడం ద్వార దైవత్వం సిదిస్తుంది. దీనిలో మూడు రకాలు ఉన్నాయి.

1.శివ గంధం, 2.శక్తి గంధం, 3.విష్ణు గంధం.

శివగంధం :

దీన్ని శైవులు తయారుచేసి శివునికి అర్పించి ప్రసాదాన్ని స్వీకరిస్తారు. దీనిలో శ్రీ గంధం, అగిలు గంధం, పచ్చ కర్పూరం, చందనపు ఆకు, అరటి వేరు, కుంకుమ పూవు, రక్తగంధం, కంకుష్టాన్ని ఉపయోగిస్తారు. ఈ శివగంధాన్ని శాస్త్రబద్ధంగా తయారుచేసి దీనిని మూల విగ్రహానికి అంటే శివలింగానికి ప్రతిరోజు పెడితే దేవాలయ వాతావరణం శాంతంగా ఉంటుంది. అన్ని రకాల వాస్తు దోషాలు తొలగి దేవునికి కళ వస్తుంది.

శక్తిగంధం :

దేనిని ఎక్కువగా స్త్రీ దేవతల దేవాలయాలలో శాస్త్రబద్ధంగా చేసి, దేవికి ఈ శక్తీ గంధాన్ని పెడతారు

ఈ శక్తి గంధాన్ని శ్రీగంధం, అగిలు గంధం, పచ్చ కర్పూరం, కచోర, కుంకుమ పూవు, గోరోజనం, జటమాసి, శిలారసాల నుంచి తయారుచేస్తారు .

శక్తి గంధాన్ని మూల విగ్రహమైన స్త్రీ దేవాలయంలో ఉండే మూర్తికి పెడతారు. దీనితో దేవాలయములో దోషాలు, వాస్తు దోషాలు తొలగిపోతాయి.

విష్ణు గంధం :

విష్ణు గంధాన్ని అన్ని విష్ణు దేవాలయలో ఉపయోగిస్తారు. దీనిలో శ్రీగంధం, అగిలు గంధం, బావాంచ, కంకుష్ట పువ్వు, మురామంసి, జటామాంసి, సిలరసం వీటిని మూల విగ్రహనికి పెట్టి అనంతరం పూజ కార్యక్రమాలు ముగిసిన తరువాత భక్తులకు ప్రసాదరూపంలో పంచుతారు.

దీన్నింత ఒకే ప్రమాణంలో గందం తీసి అ గంధాన్ని స్వామికి లేదా దేవికి అర్పించి స్వీకరిస్తే అటువంటి వారికీ దేహంలో ఉండీ సమస్త వ్యాధులు తొలగి, దేవుని అనుగ్రహంతో అన్ని పనులు సత్వరమే సిద్దిస్తాయి

అష్టగంధం ఏమిటంటే...!

దేన్నే లేపన గంధం అనీ, అష్ఠగంధమని, గంధషత అని కూడా పిలుస్తారు. దీన్ని ధరిస్తే ఆకర్షణతో పాటు తేజోవంతులు, దైవనుగ్రహ సంభూతులు, కీర్తివంతులు అవుతారు. దీన్నీ ఏ దేవాలయంలో అయితే ఉపయోగిస్తారో ఆ దేవునికి, దేవతా కళ ఎక్కువ అవుతుంది. ఈ గంధాన్ని స్త్రీలు కూడా ధరించవచ్చు. ●

సమస్యా పూరణం

సాహిత్యంలో సమస్యాపూరణం సరస వినోదమయిన, హృదయ రంజక మయిన ప్రక్రియ. ఇవ్వబడిన పదములను, వేరే పదములతో కలిపి అర్ధవంతముగా చెప్పడమే సమస్యాపూరణం.

ఈ సమస్యాపూరణాలు భోజ రాజు కాలం నుంచీ ఉన్నాయి. భోజ రాజు గొప్ప ప్రభువే కాకుండా గొప్ప కవి, కవిపోషకుడు, కళాపోషకుడు, విద్వాంసుడు. అతడు ఇచ్చే సమస్యలను కాళిదాసు సరసంగా పూరించేవాడు. ఒకసారి భోజ రాజు ‘టంటంట టంటంట టటం టటం టం ‘

అనే సమస్యను ఇచ్చి పూరించామన్నాడట. దానిని కాళిదాసు ఈ విధంగా పూరించాడు.

“రాజ్యాభిషేకే మదవిహ్వాలయాః
హస్తచ్చ్యుతో హేమఘటోయువత్యాః
సోపాన మార్గేషు కరోతి శబ్దం
టంటంట టంటంట టటం టటం టం.”

భావము : రాజుగారు స్నానం చేసే సమయంలో చూచిన ఒక పరిచారిక మోహపరవశంతో తన చేతిలో ఉన్న బంగారు కలశం జారవిడిచినప్పుడు,మెట్ల మీది నుండీ ‘టంటంట టంటంట టటం టటం టం’ అని శబ్దం చేసుకుంటూ అది జారి క్రిందపడిందిట .

సాహితీజైత్రయాత్ర గావించిన శ్రీనాధుడికి ఒక రాజాస్థానములో ఆయనను అవమానించే ఉద్దేశముతో బండిర (అ) తో క్రింది సమస్యను ఇచ్చారు. మన కవులు సామాన్యులా...వాళ్ళ వేలితో వాళ్ళ కన్నే పొడిచి వచ్చే మేధా సంపన్నులు. ‘అందఱునందఱు మఱియు నందఱు యంద అందరే’ అన్న సమస్యను శ్రీనాధుడు ఎలా పూరించాడో చూడండి.

కొందఱు భైరవాశ్వములు, కొందఱు పార్థుని తేరి టెక్కముల్
కొందఱు ప్రాక్కిటీశ్వరులు, కొందఱు కాలుని యెక్కిరింతలున్
కొందఱు క్రిష్ణజన్మమున కూసిన వారలు కావునన్ మహే
అందఱునందఱు మఱియు నందఱు యంద అందరే.

భావము: ఈ సభలో ఉన్నవారు కొందరు కుక్కలు (భైరవుడి అశ్వాలు), కొందరు కోతులు (అర్జునుడి రధంపై జండాలు), కొందరు పందులు (ఆది వరాహాలు), మరికొందరు దున్నపోతులు (యమ ధర్మరాజు వాహనాలు), మరికొందరు కృష్ణుడు జన్మించినప్పుడు కూసిన వారు...అంటే గాడిదలు ...ఈ సభలో ఉన్నవారంతా అటువంటి వారే!

పద కవితా పితామహుడు

తాళ్ళపాక అన్నమాచార్య

తాళ్ళపాక అన్నమాచార్యులు (మే 9, 1408 – ఫిబ్రవరి 23, 1503) తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు (సాధారణ భాషలో గేయాలను కూర్చేవారు). అన్నమయ్యకు పద కవితా పితామహుడు అని బిరుదు ఉంది. దక్షిణాపథంలో భజన సాంప్రదాయానికి, పదకవితా శైలికి ఆద్యుడు. గొప్ప వైష్ణవ భక్తుడు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని, అహోబిలములోని నరసింహస్వామిని, ఇతర వైష్ణవ సంప్రదాయ దేవతలను కీర్తిస్తూ 32 వేలకు పైగా కీర్తనలు రచించాడు. అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలలో భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారు, భావలాలిత్యం పెనవేసికొని ఉంటాయి.

అన్నమయ్య తండ్రి అయిన నారాయణమూర్తి గొప్ప కవి, పండితుడు, సకల విద్యాధురంధురుడుగా ప్రసిద్ధికెక్కినవాడు. నారాయణసూరి ధర్మపత్ని లక్కమాంబ, మహా భక్తురాలు. మధురంగా పాడుతుంది. ఆ దంపతులు తిరుమల తిరుపతిని దర్శించుకొని, ధ్వజస్తంభం ఎదురుగా సాష్టాంగ ప్రమాణం ఆచరించినపుడు ఒక దివ్యమైన కాంతి లక్కమాంబ గర్భంలో ప్రవేశించిందని గాథ. కొండలయ్య తాను ధరించే 'బిరుదు గజ్జియల ముప్పిడి కఠరాన్ని' వారికందజేశాడట. అలా పుట్టిన శిశువే అన్నమయ్య.

లక్కమాంబ గర్భవతి అయింది. వైశాఖమాసం విశాఖ నక్షత్రంలో ఒక శుభలగ్నంలో మూడు గ్రహాలు ఉన్నత దశలో వుండగా నారాయణసూరి, లక్కమాంబలకు నందకాంశమున పుత్రోదయమైనది. మగశిశువు ఉదయించాడు. సర్వధారి సంవత్సరం వైశాఖ శుద్ధ పూర్ణిమ నాడు (మే 9, 1408) కడపజిల్లా రాజంపేట మండలం తాళ్ళపాక గ్రామములో అన్నమయ్య జన్మించాడు. 8వ యేట అన్నమయ్యకు ఆయన గురువు ఘనవిష్ణు దీక్షనొసగినపుడు అన్నమాచార్య నామం స్థిరపడింది. నారాయణసూరి ఆ శిశువునకు ఆగమోక్తంగా జాతకర్మ చేశాడు.

'అన్నం బ్రహ్మేతి వ్యజనాత్' అనే శ్రుతి ప్రకారం నారాయణసూరి పరబ్రహ్మ వాచకంగా తన పుత్రునకు అన్నమయ్య అని నామకరణం చేశాడు. అన్నమయ్యకు అన్నమయ్యంగారు, అన్నమాచార్య, అన్నయగురు, అన్నయార్య, కోనేటి అన్నయ్యం గారు అనే నామాంతరాలు తాళ్ళపాక సాహిత్యంలోను, శాసనాల్లోనూ కనిపిస్తాయి.

అన్నమయ్య బాల్యం

'హరి నందకాంశజుం డగుట డెందమున
పరమ సుగ్యాన సంపద పొదలంగ...'

అన్నమయ్య బోసి నవ్వులు వొలకబోస్తూ నలుగురినీ మురిపించేవాడు. మాటిమాటికి వెంకటప్పకు జోతలు పెట్టేవాడు. వెంకన్న పేరు చెబితేనే ఉగ్గుపాలు త్రాగేవాడు. వేంకటపతికి మొక్కుమని చెబితేనే మొక్కేవాడు. వేంకటపతిమీద జోలపాడనిదే నిద్రపోడు. లక్కమాంబ భక్తిగీతాలు పాడుతుంటే పరవశించి పోయేవాడు. నారాయణసూరి కావ్యాలలో అర్థాలు వివరిస్తూ వుంటే తాను ఊ కొట్టేవాడు. ఇలా అన్నమయ్య శిశుప్రాయం నుండి వేంకటపతి మీది ధ్యానంతో ప్రొద్దులు గడిపేవాడు. అన్నమయ్యకు అయిదు సంవత్సరాలు వయస్సులో నారాయణసూర్తి ఆర్యుల సమ్మతి ప్రకారం ఉపనయనం చేయించాడు.

తిరుమల పయనం

ఒకనాడు (8వ ఏట) ఎవరికీ చెప్పకుండా అన్నమయ్య కాలినడకన తిరుపతి బయలుదేరాడు. సంప్రదాయం తెలియక తిరుమల కొండను చెప్పులతో కొండనెక్కుచుండగా అలసిపోయి ఒక వెదురు పొదలో నిద్రపోయెను. అప్పుడు ఆయన కలలో అలివేలు మంగమ్మ దర్శనమిచ్చి పరమాన్నాన్ని ప్రసాదించి, పాదరక్షలు లేకుండా కొండనెక్కుమని బోధించింది. అప్పుడు పరవశించి అలమేలుమంగను కీర్తిస్తూ అన్నమయ్య శ్రీవేంకటేశ్వర శతకము రచించాడు. తిరుమలలో ఘనవిష్ణువు అనే మునిస్వామి అన్నమయ్యను చేరదీసి అతనికి భగవదాజ్ఞను తెలిపి శంఖ చక్రాదికములతో శ్రీవైష్ణవ సంప్రదాయానుసారముగా పంచ సంస్కారములను నిర్వహించాడు. గురువుల వద్ద వైష్ణవ తత్త్వాలను తెలుసుకొంటూ, ఆళ్వారుల దివ్య ప్రబంధాలను అధ్యయనం చేస్తూ, వేంకటేశ్వరుని కీర్తిస్తూ తిములలోనే అన్నమయ్య జీవితం గడప సాగాడు.

సంసారం, సంకీర్తనం

అన్నమయ్య తిరుమలలో ఉన్నాడని విని అతని తల్లిదండ్రులు తిరుమలకు వెళ్ళి అతనిని ఇంటికి తిరిగి రమ్మని బ్రతిమాలారు. ముందు నిరాకరించినా గాని అన్నమయ్య గురువు ఆనతిపై తాళ్ళపాకకు తిరిగి వచ్చాడు. కాని నిరంతరం భగవధ్యానంలో ఉంటూ స్వామిని కీర్తిస్తూ ఉండేవాడు. అతనికి యుక్త వయస్సు రాగానే తిమ్మక్క, అక్కమ్మ అనే పడతులతో వివాహం చేశారు తల్లిదండ్రులు. వైవాహిక జీవితంలో పడిన అన్నమయ్య ఒక మారు తన ఇద్దరు భార్యలతో కూడి తిరుమలను దర్శించాడు. ఆ సమయంలోనే శ్రీవేంకటపతికి రొజుకొక సంకీర్తన వినిపించాలని సంకల్పించాడు. అప్పటి నుండి అన్నమయ్య పుంఖానుపుంఖాలుగా కీర్తనలు చెప్పాడు.

రాజాశ్రయం

విజయనగర రాజ ప్రతినిధి, దండనాథుడు అయిన సాళ్వ నరసింగరాయలు (ఇతడు శ్రీకృష్ణదేవరాయలకు తాత) టంగుటూరు కేంద్రంగా ఆ సమీ ('పొత్తపినాడు') పాలనా వ్యవహారాలు చూస్తుండేవాడు. అతనికి 'మూరురాయర గండ' అనే బిరుదుండేది. అన్నమయ్య కీర్తనలు, అతని ఆశీర్వచన మహత్త్మ్యం గురించి విన్న దండనాథుడు తాళ్ళపాకకు వెళ్ళి అన్నమయ్యను దర్శించి అతనితో సాన్నిహిత్యాన్ని పెంచుకొన్నాడు. తరువాత అతను పెనుగొండ ప్రభువయినాక అన్నమయ్యను తన ఆస్థానానికి ఆహ్వానించాడు. రాజ ప్రాపకం వలన అన్నమయ్య సంగీత ప్రభావం కన్నడ దేశంలో హరిదాసకూటాలలో ప్రసిద్ధమయ్యింది.

అంత్యకాలం

రాజాస్థానం తనకు తగినది కాదని తెలుసుకొని అన్నమయ్య తిరుమల చేరాడు. తన శేషజీవితాన్ని స్వామి సన్నిధిలో నిత్యారాధనలో, సంకీర్తనా దీక్షలో గడిపాడు. ఈ దశలో బహుశా ఆధ్యాత్మిక సంకీర్తనలు అధికంగా రచించాడు. ఈ సమయంలోనే పురందర దాసు తిరుమలకు వచ్చాడు. ఇద్దరూ వయోవృద్ధులు, భక్తశ్రేష్ఠులు, విష్ణుసేవాతత్పరులు, సంగీత కళానిధులు. ఒకరినొకరు ఆదరంతో మన్నించుకొన్నారు. 'మీ సంకీర్తనలు పరమమంత్రాలు, వీటిని వింటే చాలు పాపం పటాపంచలౌతుంది. మీరు సాక్షాత్తు వేంకటపతి అవతారమే' అని పురందరదాసు అన్నాడట. అప్పుడు అన్నమాచార్యుడు 'సంధ్య వార్చుకోవడానికి సాక్షాత్తు విఠలునితోనే నీళ్ళు తెప్పించుకొన్న భాగ్యశాలివి. మీ పాటలు కర్నాటక సంగీతానికే తొలి పాఠాలు. మిమ్ము చూస్తే పాండురంగని దర్శించుకొన్నట్టే' అన్నాడట. 95 సంవత్సరాలు పరిపూర్ణ జీవితం గడిపిని అన్నమయ్య దుంధుభి నామ సంవత్సరం ఫల్గుణ బహుల ద్వాదశినాడు (ఫిబ్రవరి 23, 1503) పరమపదించాడు. రాగిరేకుల మీద వ్రాసిన తిథుల కారణంగా అతని జనన, మరణ దినాలు తెలుస్తున్నాయి.

(తరువాయి 8వ పేజీలో)

సున్నపై ములుగు విశ్వనాధశాస్త్రి గారి కవితా విన్యాసం ‘000000000000000000’

‘0’ కి విలువెంత అని ‘పంతుల్ని’ అడిగితే
‘సున్నా’ కి విలువేంటి? ‘శూన్యం’ అంటాడు!
‘0’ లేకుండా
‘పంతులూ’ లేడు! ఏ ‘పండితుడూ’ లేడు!

‘అంకెల’ దరిజేరి అది విలువలను పెంచు!
పదముల దరిజేరి పదార్థములనే కూర్చు!
‘సున్న’ ప్రక్కన ‘0’ చేరి ‘సున్నం’ అయ్యె!
‘అన్న’ ప్రక్కన ‘0’ చేరి ‘అన్నం’ అయ్యె!
‘ఆంధ్రా’లో ‘అన్నబియ్యం’ కూడా కిలో ‘రెండు’ అయ్యె!

‘పది’ మధ్యలో దూరి
‘పంది’ గా మారె!
‘నది’ మధ్యలో దూకి
‘నంది’గా మారె!

ప్రతి ‘కొంప’లోనూ
అది తిష్ట వేసింది!
‘0’ లేనట్టి ‘సంసారమే’ లేదు!

‘కాంగి’ లోనూ దూరె!
‘దేశం’ లోనూ దూరె!
‘కమలం’ లోనూ దూరె !
అది ‘రాజకీయం’ కూడా నడుపుచుండె!
‘పంచాయతీ’ నుండి ‘పార్లమెంటు’ వరకూ అది మెంబరై ఉండ!

‘గుండుసున్నా’
అని ఎగతాళి చేయకు
‘గూండా’ గా మారి రుబాబు చేయు!

‘ఆరంభము’న ‘0’! ‘అంత’ మందున ‘0’!
‘జననం’ లో ‘0’!
‘మరణం’లో ‘0’!
‘శూన్యం’లో ‘0’! ‘అనంతము’లో ‘0’!

‘ఇందూ’, ‘అందూ’
అను సందేహమేల!
‘అండ’, ‘పిండ’, ‘బ్రహ్మాండము’లలో ‘0’!

‘సత్యం’,
‘శివం’,
‘సుందరం’
అన్నింటిలోనూ అది అలరారుతోంది!

‘0’ తోటే ఉంది
‘అందం’! ‘ఆనందం’!
‘జీవితం’లో చివరకి మిగిలేది ‘0’ !

‘గోవిందా’! ‘ముకుందా’! ‘శంభో’! ‘శంకరా’!
‘సున్నాలు’ గలవే ఈ భగవన్నామాలు అన్నీ!
‘ఏడుకొండల’ వాడా! ‘వెంకట’ రమణా!
నీకు నామాలతో పాటు అందు ‘సున్నాలు’ లేవా!

తిరుపతిలో ఎక్కు ప్రతి ‘కొండ’ లోనూ ‘0’!
తిరిగి దిగి వచ్చు ప్రతి ‘గుండు’ లోనూ ‘0’!

ఇంత మహిమ గల ‘0’ –
మరి ‘గుడి’ లోను లేదని, ‘బడి’ లోను లేదని
దిగులెందుకన్నా!

‘గుడి’ లోన జేరి ‘గుండి’గా,
‘బడి’ లోన జేరి ‘బండి’గా మారడం దాని ‘అభిమతం’ కానే కాదన్నా!

కనుక గుడి ‘గంట’ లో చేరి, బడి ‘గంట’ లోనూ చేరి
మోత మోగిస్తోందన్నా!
ఆ మోత ‘నాదం’ లోనూ ‘0’!

‘కాలం’ తోటే అది పరుగులిడుతోంది!
ప్రతి ‘గంట’,
ప్రతి ‘దినం’,
ప్రతి ‘వారం’,
ప్రతి ‘పక్షం’,
ప్రతి ‘మాసం’,
ప్రతి ‘సంవత్సరం’,
అన్నిటా ఉండి ‘కాలచక్ర’ను అది తిప్పుతోంది!

‘వారం’, ‘వర్జ్యం’ అంటూ, ‘గ్రహం’ – ‘గ్రహణం’ అంటూ
‘పంచాంగం’ అంతా ‘సున్నా’ల మయమే!

‘దేహం’ తోటే అది అంటిపెట్టుకుని ఉండె!
‘కంటి’ లోనూ ‘0’!
‘పంటి’ లోనూ ‘0’!
‘కంఠం’ లో ‘0’!
‘కందరం’ లో ‘0’!
‘చర్మం’ లో ‘0’!
‘రక్తం’ లో ‘0’!

‘దాహం’ లో ‘0’!
‘మోహం’ లో ‘0’!
‘రాగం’ లో ‘0’! ‘అనురాగం’లో ‘0’!
‘సరసం’ లో ‘0’!
‘విరసం’ లో ‘0’!
‘కామం’ లో ‘0’!
‘క్రోధం’ లో ‘0’!
‘నరనరం’ లో అది ‘జీర్ణించుకు’ని పోయె!

‘రోగం’లో ‘0’ ! దానికి చేసే ‘వైద్యం’లో ‘0’!
‘అంగాంగము’ న ‘0’ అంటిపెట్టుకుని ఉండ
‘దేహం’ తోటే అది దహనమగుననిపించె!
తీరా చితా ‘భస్మం’ చూడ అందు కూడ కనిపించె!
మన గతులనే మార్చివేసి అది ‘గంతు’లేస్తోంది!
‘జైహో’ సున్నా
జయ జయహో సున్నా “0” ●

(7వ పేజీ తరువాయి) ఇతడు శ్రీమహావిష్ణువు యొక్క ఖడ్గం అయిన నందకాంశ సంభూతుడు అని భావన ఉంది. ‘పదకవితా పితామహుడు’ ‘సంకీర్తనాచార్యుడు’ ‘పంచమాగమ సార్వభౌముడు’ ‘ద్రవిడాగమ సార్వభౌముడు’ – ఇవి అన్నమయ్యకు సమకాలీనులు సాదరంగా ఇచ్చిన బిరుద నామాలు. అవసాన కాలంలో తన కొడుకు పెద తిరుమలయ్యను పిలిచి, ఇంక దినమునకు ఒక్క సంకీర్తనకు తక్కువ కాకుండా శ్రీనివాసునకు వినిపించే బాధ్యతను అతనికి అప్పగించాడట.

దొరికిన పెన్నిధి

1922లో 14,000 అన్నమయ్య కీర్తనలు, ఇతరులు లిఖించిన 2,500 రాగిరేకులు తిరుమల సంకీర్తనా భాండాగారం (తరువాత పెట్టిన పేరు)లో లభించాయి. ఇది తిరుమల హుండీకి ఎదురుగా ఉన్న ఒక రాతి పలకాల గది. ప్రాజెక్టులు, సంస్మరణా కార్యక్రమాలు అన్నమయ్య యొక్క విస్తృత పద సంపదను ఉపయోగించుకొని ప్రజలలో వేంకటేశ్వరుని మధురభక్తిని మరియు శరణాగతిని ప్రోత్సహించడానికి అన్నమాచార్య ప్రాజెక్టు స్థాపించబడింది.

– వల్లూరి పవన్‌కుమార్

బ్రాహ్మణ సంఘం గ్రేటర్ వరంగల్ శాఖ

బాల్యమా... ఓసారి... నా పల్లెకు రా...!!.??

పిల్లల్ని , కోడిపిల్లల్ని చేసి
కాన్వెంట్ గెద్దలు తన్నుకుపోతే..!!
తల్లికోడై నా బడిశాల తల్లడిల్లుతోంది..!
చదువుల తోటలో స్వేచ్ఛగా ఎగరాల్సిన సీతాకోకచిలుక
యిపుడు కాన్వెంట్ జైల్లో ఖైదీ..!

మూలాలు మరచిపోతున్నవ్యవస్థలో..!!
ట్వింకిల్ ట్వింకిల్ తళుకుల ముందు
నా తెలుగు వాచకం తలదించుకుంటోంది..!
బాబా బ్లాక్ షీప్ నిగనిగల ముందు
నా నీతి శతకాలు నివ్వెరబోతున్నాయి..!
చదువులతల్లి, సంతలో అంగడిసరుకై నిలబడ్డపుడు
బాల్యం, కాసుల కొమ్మలకు చిక్కిన
గాలిపటమై కొట్లాడుతోంది..!

భుజాల మీద భూగోళాన్ని మోస్తూ , వాడు
బస్సుకొమ్మన వేలాడే గబ్బిలమై
భారంగా యింటికి చేరినపుడు



ఈయన పేరు ప్రతాప్ సారంగి... కనీసం లక్ష రూపాయల బ్యాంకు బేలన్స్ లేని సారంగి గారు, బిజెపి యంపిగా ఒడిషాలో ఘనవిజయం సాధించారు. చిన్న ఇంట్లో ఉంటూ సైకిల్ పైనే ప్రయాణిస్తారు. నిజాయితీకు మారుపేరు. సారంగి గారిని ఒడిషా మోది గా పిలుస్తారు. ఒరిస్సాలో బాలసోర్ నియోజకవర్గ ఎంపీ భాజపా ఎన్నికైన ప్రతాప్ సారంగీ రెండు సార్లు ఎం.ఎల్.ఏ.గా పని చేసారు. ఒక లక్ష కూడా బ్యాంక్ బాలన్స్ లేదు. సమాజ కార్యం తన లక్ష్యంగా **100**కి పైగా గిరిజన ప్రాంతాల్లో సంస్కార కేంద్రాలు, మద్యపానంకి వ్యతిరేకంగా పనిచేసారు. నిత్యం భారత మాత సేవలో జీవితం గడిపే నిస్వార్థ సేవకులు ఎందరో మరి ఎందరో.

చల్లని ఒడిలో
చుక్కల ఆకాశాన్ని చూపించాల్సిన , అమ్మ
బబుల్ గమ్ లా సాగే సీరియల్స్ వెంట
బతుకంతా పరుగెడుతుంది..!
వెచ్చని గుండెల మీంచి పొద్దును చూపించాల్సిన , నాన్న
పచ్చనోట్ల మధ్య బతుకును వెతుకులాడుతుంటాడు..!

చుట్టూరా ముళ్ల కంచెలా ఫెన్సింగ్
గేటుముందు యమకింకరుడు గూర్ఖా
యే బంధుత్వాలూ చేరని
ఖరీదైన కారాగారం యింటిలో...!!
ప్రాణంలేని బొమ్మలమధ్య
ప్రేమను పంచలేని కదిలే బొమ్మలమధ్య
కేవలం ప్రాణమున్న బొమ్మలా...వాడు..!

మనుషులు, నడిచే మార్కెట్లయినపుడు
ఉట్టికెగరలేని ఊహలు
ఆశల ఆకాశానికెగబాకుతున్నపుడు
ఒత్తిడి నిండిన బాల్యం ఊదిన బెలూనై పేలిపోతుంది....!
మొక్క నుండి ఆకును తుంచేసినట్టు
బతుకు నుండి బాల్యం తుంచేయబడుతుంది..!
నాలుగుదిక్కుల్లో విస్తరించాల్సిన తరగతిగది
నాలుగు గోడలకు పరిమితమై
బతుకుతెరువుకు పనికిరాని సిలబస్ వెంట
తరగతులై పరుగెత్తీ పరిగెత్తీ ఓసారి వెనక్కి తిరిగిచూస్తే..!!
శిథిలమైన బాల్య శకలాల కింద శూన్యమే పెక్కిరిస్తోంది..!!!

కార్పోరేట్ కాన్వెంట్ల రెక్కల పహారాలో
కునారిల్లుతోన్న ఓ బాల్యమా..!!
కణకణ మండే నిప్పులగుండం మీద
కాలంతో పరుగు పందెమిక చాలు..!
నీ పట్నం యినుప చట్రాల్లోంచి
నీ ఆంగ్లవ్యామోహ కామినీ కౌగిళ్లలోంచి
ఓసారి నా పల్లెకు రా...!

అమ్మ ఒడిలాంటి ప్రకృతిబడిలో.....
గడ్డి పరక మీద మెరిసే జలతలంబ్రాల్లోంచి
రంగురంగుల హరివిల్లు చూపిస్తాను..!
నదీమ తల్లి యిసుక తిన్నెల మీద
పిచ్చుకగూళ్లు కడతాను..!
చైత్ర మాసపు పున్నమి రాత్రుల్లో
వీధి అరుగులమీద పూసిన వెన్నెల గంధాన్ని
నీ ఒంటికి పూస్తాను..!
పెరటి కొమ్మన దొంగిలించిన జామకాయ
కాకెంగిలి పెడతాను..!

పచ్చని తోటల్లో పసిడి పూల కాంతుల్ని చూపిస్తూ..
కోయిలమ్మల పాటలు వినిపిస్తాను..!
వేపచెట్ల నీడల్లో ఉయ్యాల లూపుతూ
పారే సెలయేటిలో నీ ప్రతిబింబాల్ని చూపిస్తాను..!
కాలువగట్ల వెంట పడుతూ లేస్తూ పరుగెడుతూ...
పచ్చని జ్ఞాపకాల్ని నీ కనురెమ్మలకు వేలాడదీస్తాను..!
నీ తాత,దండ్రుల పాదముద్రల,మీదుగా
నిన్ను చిటికెన వేలుపట్టి సడిపిస్తాను..!
బాల్యమా...ఓసారి నా పల్లెకు రా...!!



పిలిస్తే పలికే దేవుడు - విఠలుడు

- భావరాజు పద్మిని

పూర్ణ భక్తికి బద్ధుడు భగవంతుడు. సుదర్శన చక్రంచే బాధింపబడుతున్న దుర్వాసుడు శ్రీమహావిష్ణువును శరణు వేడినప్పుడు, ఆయన ఇలా అన్నారు,

అహం భక్త పరాధీనో హ్యస్వతంత్ర ఇవ ద్విజ
సాధుభిర్గ్రస్త-హృదయో భక్తైర్భక్త-జన-ప్రియః (భాగవతం 9.4.63)

"నేను సర్వ స్వతంత్రుడను అయినా, నా భక్తులకు బానిస అయిపోతాను. వారు నాకు అత్యంత ప్రియమైన వారు. నేను వారి ప్రేమకు ఋణ పడివుంటాను. నా దాసులకు దాసులు కూడా నాకు అత్యంత ప్రియమైన వారే!"

మతంలో తర్కాన్ని, విజ్ఞానశాస్త్రంలో నమ్మకాన్ని ఉంచుతూ, ప్రశ్నలే తప్ప జవాబులు లేని విధంగాను, ప్రశ్నలతోనే జీవితాలు గడిచిపోయే విధంగానూ ఉన్నది ప్రస్తుత స్థితి. అందుకే, దైవం ఒక్కసారి కాదు, అనేకమార్లు తన భక్తులకు తానున్నానన్న ధీమా కలిగించేందుకు, పదేపదే తార్కాణాలు చూపుతున్న కొన్ని ఘనమైన పుణ్యక్షేత్రాలు మన పవిత్ర భారతావనిలో నెలకొని ఉన్నాయి. అటువంటి క్షేత్రాలలో ముఖ్యమైనది, పండరీపురము.

మహారాష్ట్రలోని అత్యంత ప్రముఖమైన పుణ్యక్షేత్రాలలో 'పండరీపురం' ఒకటి. శ్రీహరి, తన మనసు గెల్చుకున్న 'పుండరీకుడు' అనే భక్తుడి పేరుతోనే ఇక్కడ నెలవై ఉన్నారు. అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రం, పురాణేతిహాసాలలో ప్రముఖమైన పాండురంగ విఠలుని దివ్యధామంగా వర్ణించబడింది. ఈ క్షేత్రం చంద్రభాగా నదీ తీరంలో ఉంది. ఈ నది అర్ధ చంద్రాకారంలో వుంటుంది, అందువలన దీన్నే 'చంద్రభాగ' నది అంటారు. ఈ నదినే భీమా నది అని కూడా పిలవడం జరుగుతోంది.

ఈ క్షేత్రానికి సంబంధించిన పురాణ గాథ ఈ విధంగా ఉంది.

అనేక వ్యసనాలకు బానిసగా జీవనం గడుపుతున్నాడు పుండరీకుడు. భోగ లాలసతలో మునిగి తేలుతూ, జులాయిగా తిరుగుతున్న పుండరీకుడు, చివరకు విష్ణు భక్తి పరాయణులైన తల్లిదండ్రుల్ని, భార్యను కూడా నిర్లక్ష్యం చేశాడు. పుండరీకుని ఆగడాలను భరించలేని అతని తల్లిదండ్రులు, తమ కొడుకును మార్చమని ఆ శ్రీహరిని వేడుకున్నారు. వేశ్యాలోలుడైన పుండరీకునికి, వారి అసలు గుణాన్ని తెలిసేలా చేసాడు భగవంతుడు. ఆ మోహం నుంచి బయటపడ్డ అతడు, భగవంతుడి పట్ల మనం చూపే ప్రేమే నిజమైనదని గ్రహించాడు. ఆయనను చేరుకోవడానికి భక్తికి మించిన మరో మార్గంలేదని గ్రహించి, ఆనాటి నుంచి శ్రీహరిని సేవించడం మొదలుపెట్టాడు. అహోరాత్రాలు ఆహార పానీయాలు మాని, పశ్చాత్తాప హృదయంతో తన తల్లిదండ్రులకు సేవచేశాడు. తన భక్తుడైన పుండరీకుడిని, పాండురంగడు పరీక్షించదలచి, పుండరీకుడి దగ్గరకు వచ్చి, తాను వచ్చానని చెప్పాడు. ఆ సమయంలో పుండరీకుడు మాతాపితల సేవలో నిమగ్నమై ఉన్నాడు. అందుకే ఈ సంగతి చెప్పి, ఒక ఇటుకను బయటకు విసిరి, ఆ ఇటుక పడిన చోట నిరీక్షించమని పాండురంగడికి చెప్పాడు. శ్రీహరి ఆ ఇటుక పడిన చోటే శిలారూపుడై నిలిచిపోయాడట. శ్రీహరి శిలారూపుడైపోయి, పాండురంగ విఠలుడిగా వెలసిన పుణ్యప్రదేశమే పండరీపురం.

ఆలయ వైశిష్ట్యం - దర్శనీయ ప్రాంతాలు

విఠలుడు అనే పేరు 'విట్టు' లోంచి వచ్చిందంటారు. విట్టు అంటే కన్నడంలో, మరాఠీలో ఇటుక. స్వామి ఇటుకపై కొలువై ఉన్నారు కనుక, ఆయనను ఇలా పిలవడం జరుగుతోంది. గర్భాలయంలో ఎత్తయిన వేదిక మీద, దాదాపు 3 అడుగుల ఎత్తు పాండురంగని విగ్రహం రెండు చేతులూ నడుము మీద పెట్టుకుని భక్తులకు అభయమివ్వటానికే వున్నానన్నట్లు వుంటాడు. అనునిత్యం పాండురంగస్వామి నామ స్మరణతో మారుమ్రోగే ఈ గర్భాలయ శోభవర్ణనాతీతం. పాండురంగని మూలమూర్తికి సమీపంలో రుక్మిణీ మాత మందిరం ఉంది. ఈ ఆలయం ఏ కాలంనాటిదో చెప్పడానికి ఆధారాలు లేకపోయినప్పటికీ, 12-13 శతాబ్దాల కాలంనుంచే ఈ ఆలయానికి చెందిన ఉనికి ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఆలయంలో ఉన్న విఠలుని మూలమూర్తి అంతకన్నా ప్రాచీనమైనదన్న ఆధారాలు ఉన్నట్లు చెబుతారు.

ప్రధానాలయానికి ముందుద్వారం మధ్య భాగంలో భక్తాగ్రేసరుడు నామ్‌దేవ్ మహరాజ్ సుందరిమూర్తి ఒకటి ఉంది. పండరీపురం పాండురంగస్వామి వారి దర్శనంకోసం వచ్చే భక్తులు ముందుగా నామ్‌దేవ్ మహరాజ్ వారి మూర్తిని దర్శించుకుంటేనే పాండురంగస్వామి వారిని దర్శించుకున్న ఫలం దక్కుతుందని చెబుతారు. గర్భాలయం వెండి ద్వారంమీద స్వామివారి లీలా విశేషాలను తెలిపే అందమైన మూర్తులున్నాయి. గర్భాలయ ప్రాంగణానికి కుడివైపున భక్తతుకారాం పాదుకలున్నాయి. అలాగే గర్భాలయ మంటపంలో వినాయకుడు, లక్ష్మీనారాయణ మూర్తులున్నాయి. గర్భాలయ మండపం 16 స్తంభాలతో నిర్మితమైంది.

విఠలుని గర్భగుడిముందువున్న మండపంలో వెండి రేకు తాపడం చేసిన స్తంభం ఒకటి వుంటుంది. భక్తులు దీనిని కౌగలించుకుని నమస్కారం చేసి, భగవంతుడిని కౌగలించుకున్నట్లు, ఆయన ఆశీర్వదించినట్లు భావిస్తారు. ఈ స్తంభము దగ్గరే పురందరదాసు భజనలు చేస్తూ నుంచునేవాడట. అందుకే దీనిని పురందరదాసు స్తంభము అనికూడా అంటారు. ఇక్కడ పాండురంగడితో సహా అన్ని దేవతా మూర్తుల పాదాలమీద మన శిరస్సు పెట్టి, ప్రణామం చెయ్యవచ్చు.

ఈ ఆలయ ప్రాంగణంలో ఉన్న అనేక ఉపాలయాల్లో కాలభైరవుడు, సూర్య నారాయణుడు, సత్యభామ, దత్తాత్రేయుడు, ఏక ముఖ దత్తాత్రేయుడు, మహాలక్ష్మి, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి వగైరా దేవతలని దర్శించవచ్చు. పండరీపురం క్షేత్రానికి సమీపంలో ఉన్న గోపాలపురంలో జానాబాయి, సక్కుబాయి వాడిన బిందెలు, తిరగలి, కుండలను దర్శించుకోవచ్చు.

అభంగాలు - వార్కరీ సంప్రదాయం

మహారాష్ట్రలోని వార్కరీ, కర్ణాటకలోని హరిదాసు లాంటి ఏకేశ్వరోపాసనా సంప్రదాయాలలో విఠోబా ప్రధాన దైవం. రఖమాయి సహిత విఠలుని కొలిచేవారిని వార్కరీలు అని అంటారు. తులసి మాల, చందనములతో వారు దీక్షగా నెలకొకసారో, ఏడాదికి ఒకసారో పండరీపురం తీర్థయాత్ర చేస్తారు. ఈ యత్రను వార్కరీ యాత్ర అని అంటారు. ఈ వార్కరీ సంప్రదాయానికి చెందిన వాగ్గేయకారులు మరాఠీ భాషలో, విఠోబా దేవునిపై అభంగాలు అనే దివ్య సంకీర్తనలు రచించారు.

అభంగం అంటే అంతం లేనిది అని అర్థం. భజనలు అంతరాత్మలో ప్రయాణా నికి నిర్దేశించినవైతే , అభంగాలు ముఖ్యంగా బయట సమాజంతో ఉన్న అనుభవా లను క్రోడీకరించి రాసినవి. పండరీపురానికి వెళ్ళే భక్తులు ఈ అభంగాలను గానం చేస్తూ వెళుతుంటారు.

ఈ అభంగాలు వారి జనజీవనములో ఒక భాగమయ్యాయింటే అతిశయోక్తి కాదు. ఈ అభంగాలన్నీ అనేకమంది భక్తులు వివిధకాలాల్లో బాల, స్త్రీ, పురుష, కుల మత ప్రసక్తి లేకుండా చేసినవి. మహారాష్ట్రలో భక్తి సంప్రదాయాన్ని ప్రాచుర్యం లోకి తీసుకొచ్చిన, జ్ఞానేశ్వర్ (నదేవ్), సంత్ నామదేవ్, జానాబాయి, సవతిమాలి, చోఖామేళా, నరహరి సొనార్, గోరా కుంభార్, రాకా కుంభార్, సంత్ జీ పవార్, జగమిత్ర నాగ, సేన నహ్వీ, కనహో పాత్ర, భానుదాస్, జనార్ధన స్వామి, సంత్ ఏకనాథ్, మంకోజీ బోధ్లే, సంత్ తుకారాం, సమర్థ రామదాస్ స్వామి, లతిబ్ షా, షేక్ మహమ్మద్, సక్కుబాయి, నీలోబా మక్సారే మొదలైన వారందరు అభంగాలు రాసి, గణుతికెక్కిన పాండురంగడి భక్తులు. వీరందరూ 1250 నుంచి 1650 మధ్య వున్న 400 సంవత్సరాలలో జీవించినట్లు చారిత్రిక ఆధారాలున్నాయి.

విఠోబాను ప్రధాన దైవంగా ఆరాధించే వార్కరీ సాంప్రదాయ ప్రముఖుడిగా పుండరీకుడిని అభివర్ణిస్తారు. ఇతని గాథను మనం పైన చెప్పుకున్నాము.

భక్తి సాంప్రదాయాన్ని, నామసంకీర్తనం మొదటిసారిగా జ్ఞానేశ్వరుడు సుమారు క్రీ.శ 1200 కాలంలో వెలుగులోనికి తీసుకువచ్చాడు. అప్పటి దాకా ప్రజల్లో భగవంతుని చేరాలంటే ఖచ్చితంగా సంస్కృతం తెలిసి ఉండాలనే అభిప్రాయం ఉండేది. జ్ఞానేశ్వరుడు, నామదేవుడు తమ రచనలు, భక్తి ద్వారా కులం, జాతితో సంబంధం లేకుండా పాండురంగడిని చేరే మార్గాన్ని ఉపదేశించి కొత్త సంప్ర దాయానికి బాటలు వేశారు. కేవలం భక్తి ద్వారా దేవుణ్ణి చేరుకోగలమనే భక్తి సాంప్రదాయానికి ఇదే పునాదిగా మారింది. ఇది సామాన్యులు కూడా అనుసరించగల సులువైన పద్ధతి. అందరికీ అనువుగా ఉండడంతో పిల్లలు, మహిళలు కూడా ఈ సంప్రదాయం వైపు సులభంగా ఆకర్షింపబడ్డారు. జ్ఞానేశ్వర్ (1275- 1296 క్రీ॥శ॥) మహారాజ్ వ్యాసులవారు రచించిన భగవద్గీతను మరాఠీ భాషలోకి అనువదించారు. మహారాష్ట్రులు "జ్ఞానేశ్వరి"ని చాలా పవిత్రగ్రంథంగా భావిస్తారు. ఆయన "అమృతానుభవ్" (అమృతం యొక్క అనుభవం) అనే గ్రంధాన్ని కూడా రచించారు. జ్ఞానేశ్వర్‌కి పూనాకి దగ్గరగా ఉన్న "ఆళంది" అనే గ్రామంలో మందిరం కట్టారు.

నాందేవ్ (నామదేవుడు) అనే కవి మరాఠీ భాషలో కృష్ణుని గురించి అభంగాలు రచించారు. నామదేవుడు క్రీ.శ.1270–1350 కాలానికి చెందినవాడని భావిస్తారు. ఈయన వ్రాసిన 61 కీర్తనలను గురుగ్రంథసాహెబ్‌లో కూడా చేర్చారు. జ్ఞానదేవుడి వద్ద ఈయన శిష్యరికం చేశారు. నామదేవుడు ఒకరోజు నాగనాథ దేవాలయం ముందు భజన చేస్తుంటే, అర్చకుడు ఆయనను గుడి వెనకకు పంపిస్తాడు. అక్కడ కృష్ణ భక్తితో నృత్యం చేస్తాడు. గుడి ఆయన భజన చేస్తున్న పశ్చిమ దిక్కు తిరిగిపోతుంది. ఇప్పటికీ ఆ గుడి పశ్చిమ దిక్కుకు తిరిగి వుండటం మనం చూడవచ్చు. పంజాబ్ లో నామదేవుడికి గుడి కట్టారు.

మరాఠీ భాషలో పాండురంగనిపై అభంగాలు రాసి, చరితార్థుడైన పరమ భాగవతుడు తుకారాం. అగ్రవర్ణపు అడ్డంకులను చీల్చుకుంటూ తన అస్తిత్వాన్ని నిలబెట్టుకున్నాడు. మహారాష్ట్రలోని దేహూ గ్రామ నివాసి. 1608 – 1649 మధ్య కాలంలో జీవించిన తుకారం, పాండురంగడిని సేవించడమే తన జీవితానికి పరమార్థంగా భావించాడు. పాండురంగడి ఆదేశం మేరకు అనేక అభంగాలు రచించి వాటిని ఆ స్వామికే అంకితమిచ్చాడు. తనకున్న కొద్దిపాటి ఆస్తి పాస్తులను పాండురంగడి సేవకే ధారపోసిన తుకారాం, మానవసేవే మాధవ సేవగా భావించి భక్తి మార్గాన రాగ పరిమళాలు వెదజల్లాడు. ఒక వైపున భార్యా బిడ్డలు ఆకలితో అలమటించి పోతున్నా, పాండురంగడి గురించి మాత్రమే ఆలోచించిన అనితర సాధ్యమైన భక్తి ప్రపత్తులు ఆయనలో కనిపిస్తాయి. పాండురంగడు ప్రసాదించినది మినహా వేరెవరు ఏది ఇచ్చినా స్వీకరించనంటూ, శివాజీ మహారాజు పంపిన కానుకలను సైతం తిప్పి పంపిన మహనీయుడు ఆయన. ఒకసారి ఒకరు అసూయతో కుట్ర పన్ని, ఆయన రాసిన అభంగాలను ఇంద్రాణి నదిలో విడిచిపెట్టేలా చేసారు, తుకారం 13 రోజులు ఉపవసిస్తూ, పాండురంగడిని ప్రార్థించగా, అవి నదిలో తేలుతూ తిరిగి వచ్చాయి. ఇలా తనను అన్ని విధాలుగా పరీక్షించిన పాండురంగడిని, ఒకానొక సమయంలో తుకారాం నిరసించాడు. అలాంటి పరిస్థితుల్లోనే తుకారాంకి పాండురంగడు దర్శనమిచ్చాడు. ఆ స్వామి ఆదేశం మేరకు ఆయన అభంగాలు రాయడం మొదలు పెట్టగా, ఆయన పనికి ఎలాంటి అంతరాయం కలగకుండా భార్య చూసుకుంది. తుకారం నిస్వార్థమైన భక్తికి మెచ్చిన పాండురంగడు, సశరీరంతో ఆయనను వైకుంఠానికి తీసుకువెళ్లాడు. అలా మహాభక్తుడైన ఆ వాగ్గేయకారుడి జీవితం చరితార్థమైంది.

13 వ శతాబ్దంలో నిమ్న కులస్థులు దామా, కురుండ్ దంపతులకు కుమార్తెగా జన్మించింది జానాబాయి. ఎంతో మారాం చేసి, పండరిపురానికి తల్లిదండ్రులను బయలుదేరదీసింది. జానాబాయికి పండరి విఠల దేవుని పైన ఉన్న పరిపూర్ణ భక్తి పారవశ్యతలు

అక్కడి నుండి ఆమెను కదలనీయ లేదు. చేసేది లేక ఆమె తల్లిదండ్రులు "మా కుమార్తె పూర్వ జన్మ పుణ్యం ఎంతో చేసుకున్నది.

కనుకనే ఇంతటి భక్తి భావం ఆమెలో తొణుకుతున్నది." అనుకుని, ఆమెను అక్కడే వదిలి వెళ్ళారు. గుడిలో ఆమె విఠలుడి గురించే చేస్తూ గానం చేస్తూ ఉండేది. దేవాలయానికి ప్రతిరోజూ వచ్చే దామా శ్రేష్ఠి కుంటుంబం, ఆమె భక్తికి ముగ్ధులై, ఆమెను తమ ఇంటికి రమ్మని ఆహ్వానించారు. అప్పటి నుండి వ్యాపారి దామా ఇల్లు జానాబాయి గానంతో పరిపూర్ణం ఔతున్నది. ఆమె పనిపాట్లు చేస్తూనే, విఠలుడి అర్చనలను చేసేది. ఆమె నిత్యం పండరీపుర విఠలనామ ధ్యానం చేస్తూ, పనులన్నీ చక్కగా చేసేది. ఒకరోజు ఆలయంలో దొంగతనం చేసిందని కొందరు ధూర్తులు జానాబాయిపై నిందారోపణ చేసారు. భగవంతుడే స్వయంగా తన భక్తురాలు నిర్దోషి అని నిరూపించాడు. నేటికీ జానాబాయి రాసిన 300 అభంగాలు శ్రవణానందాన్ని కలిగిస్తూ, సుమధుర గుళికల్లాగా వినిపిస్తుంటాయి.

మహారాష్ట్రలో భీమానదీ తీరాన గల పండరిపురంలో విఠలేశ్వరునిగా వెలసిన శ్రీకృష్ణుడి భక్తురాలు సక్కుబాయి. ఆమె చిన్ననాటి నుంచే ఆ పాండురంగ విఠలుని భక్తితో ఆరాధించేది. ఆమె కారణజన్మురాలు. శ్రీకృష్ణుని చేత మంత్రోపదేశం పొందిన మహాభక్తురాలు. పండరీపురం వెళ్లి పాండురంగస్వామిని దర్శించుకోవాలని సక్కుబాయి ఆరాటపడుతూ ఉంటుంది. అందుకు అత్తగారు – ఆడపడచు

అంగీకరించకపోవడంతో ఆవేదన చెందుతుంది. దాంతో శ్రీకృష్ణుడు సక్కుబాయి భర్త రూపంలో వచ్చి, ఆమెను పండరీపురానికి పంపిస్తాడు. సక్కుబాయి రాకకోసం ఎదురుచూస్తూ,ఆమె స్థానంలో ఆమె రూపంలో ఆ ఇంట్లో ఉండిపోతాడు. సక్కుబాయి పట్ల అత్తగారికి అడపదడపకి గల అభిప్రాయాలను మార్చేస్తాడు. అయితే పండరీపురం వెళ్లిన సక్కుబాయి పాండురంగస్వామిని చూసిన ఆనందంలో అక్కడే కుప్పకూలి పోతుంది. ఆమె చనిపోయిందని నిర్ధారణకాగానే అక్కడి వారు పండరీపురంలోనే ఆమెకి అంత్యక్రియలు జరుపుతారు. దైవలీలతో ఆమె తిరిగి బ్రతికి వచ్చి, తన కుటుంబాన్ని చేరుకొని, పాండురంగడి లీలలను ప్రస్తుతిస్తుంది.

ఇలా అభంగాలు చేసిన అద్భుతాలెన్నో! అసమానమైన తమ భక్తితో దైవాన్ని దివి నుంచి భువికి దించిన భాగవతులు ఎందరో మనకు పాండురంగడి భక్తులలో కనిపిస్తారు. ఇంతటి మహిమగల భక్తుల చరిత్రలు, మహిమలు, పద్ధతులను మన కళ్ళకు కట్టినట్లు వివరించారు "జయ పాండురంగ విఠలా!" అనే రామకృష్ణ మఠము వారి పుస్తకములో. ఈ పుస్తకము ఆంగ్లము నందు 'ది సెయింట్స్ ఆఫ్ మహారాష్ట్ర' గా భారతీయ విద్యా భవన్ వారు ప్రచురించారు.

మరాఠీ భజనలు ముందుగా ప్రార్థనాగీతంతో ప్రారంభమవుతాయి. తరువాత విఠోబాయొక్క భౌతిక రూప లావణ్యాలను వర్ణించే రూపంచ అభంగాలు, చివరగా ఆధ్యాత్మిక, నీతిప్రభోదకమైన మార్మిక విషయాలు తెలియజేసే అభంగాలను గానం చేస్తారు. భజనలు చేసేవారే కాక అభంగాలను దక్షిణ, ఉత్తర భారత సంగీత సంప్రదాయాల ప్రకారం స్వరపరచి శాస్త్రీయ సంగీత కళాకారులు కూడా గానం చేస్తుంటారు. పండిట్ భీమ్‌సేన్ జోషి, సురేష్ వాడ్కర్, రంజని, గాయత్రి, అరుణా సాయిరాం, జితేంద్ర అభిషేక్ మొదలగు ప్రముఖులు అభంగాలను గానం చేశారు.

ఇతర పండరీపుర విఠోబా సాహిత్యం

కన్నడదేశంలోని హరిదాసు సాంప్రదాయంలోని స్తోత్రాలు, మరాఠీ లోని హారతి పాటలు, విఠోబా సాహిత్యంలో చెప్పుకోదగ్గవి. శ్రీ రామానుజాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు, జ్ఞానేశ్వర మహారాజ్, జనాబాయి, నామదేవుడు, గోరా కుంభారుడు, సక్కుబాయి, తుకారాం, సమర్ధ రామదాసు, పురందరదాసు మొదలగువారు స్వామిపై ఎన్నో రచనలు చేసారు. జగద్గురువు శ్రీ శంకరాచార్యులు ఇక్కడికి వచ్చి పాండురంగాష్టకం రచించారు. మహీపతి రాసిన భక్తలీలామృత, భక్తవిజయ, బహినాబాయి రాసిన పుండలీక మహత్యం నామదేవుడు రాసిన సుదీర్ఘమైన అభంగం వార్కరీ సాహిత్యంలో ముఖ్యమైనవి. ఇవన్నీ పుండలీకుడు పురాణ గాథను వివరిస్తాయి. స్కాంద పురాణం లోనూ, పద్మ పురాణం, విష్ణు పురాణాల్లో కనిపించే పాండురంగ మహత్యం, పద్మ పురాణంలో కనిపించే భీమ మహత్యం విఠోబాపై రచనల్లో ముఖ్యమైనవి. నామదేవుడు, జ్ఞానేశ్వరుడు, ఇంకా అనేకమంది కవులు రాసినట్లుగా చెప్పబడుతున్న 'తీర్థావళి గాథ' అనే గ్రంథం వార్కరీ సాంప్రదాయాన్ని, విఠోబా ఆరాధనను మరింత విస్తృతం చేయడానికి రాయబడి ఉన్నాయి. ఇంకా నామదేవుడు రాసిన 'యుగే అత్తవిస విఠేవరి ఉభా', 'ఏ ఓ విఠల మాజే మౌళి రే' లాంటి హారతి పాటలు కూడా విఠోబా సాహిత్యంలో భాగమే. ఈ హారతి పాటల్లో విఠోబా పీతాంబరాలు ధరించినట్లుగా, గరుడునితోనూ, హనుమంతునితోనూ సేవలు చేయించుకున్నట్లుగా వర్ణించారు. తెనాలి రామకృష్ణుడు (16 వ శతాబ్దం) రాసిన పాండురంగ మహత్యం గ్రంథంలో విఠోబాను పాండురంగ అని సంబోధించాడు. ఇందులో ఒక పద్య భావం " ఓ పార్వతీ! భక్తుడైన పుండరీకుడు, క్షేత్రపాలకుడైన కాల భైరవుడు సేవలు చేస్తుండగా పాండురంగడు భక్తుల కోర్కెలు తీర్చే కల్పవృక్షమై ఆలయంలో వెలసియున్నాడు", అని ఉంటుంది.

ప్రత్యేక పూజలు -ఉత్సవాలు

పండరీపురంలోని శ్రీ పాండురంగస్వామి (విఠలుని) ఆలయం నిరంతరం భక్తజనంతో అందంగా, ఆహ్లాదంగా, అలరారుతూ ఉంటుంది.

చాంద్రమానం ప్రకారం ఆషాఢ మాసంలో వచ్చే శాయనీ ఏకాదశి, కార్తీక మాసంలో వచ్చే ప్రబోధిని ఏకాదశిలో విఠోబాకు విశేష పూజలు జరుగుతాయి. మాఘ, చైత్ర ఏకాదశి రోజుల్లో కూడా కొద్ది సంఖ్యలో భక్తులు విఠోబాను దర్శించు కుంటారు. సుమారు 800,000 మంది వార్కరీలు ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు పండరీపురానికి యాత్రగా వెళతారు. ఆషాఢ, కార్తీక మాసాల్లో జరిగే ఉత్సవాలు పౌర్ణమి దాకా కొనసాగి జ్యోతుల ఊరేగింపుతో ముగుస్తాయి.

షోలాపూర్ నుంచి పడమరగా సుమారు 70కి.మీ దూరంలో పండరీపురం ఉంది. బస్‌లో వెళ్ళాలి. షోలాపూర్‌కు ఉత్తరంగా ఉన్న కురుద్వాడీ అనే ఊరు నుంచి నీరజ్ వరకు ఉన్నరైలు మార్గం పండరీపురం మీదుగా వెళుతుంది. బస్‌స్టాండ్ నుంచి ఆలయం సుమారు ఒకటిన్నర కి.మీ. దూరంలో ఉంది. సైకిల్ రిక్షాలు, ఆటో రిక్షాలు ఉన్నాయి. ఆలయాన్ని ఆనుకొనే జ్ఞానేశ్వర్ భవన్ అని అధునాతంగా నిర్మించిన పెద్ద వసతి గృహం ఉంది, ఇది కాకుండా ఇక్కడ భక్తుల వసతి కోసం అనేక సత్రాలను నిర్మించారు.

ఇంతటి పావనమైన చరిత్ర కల ఈ పండరీపుర క్షేత్రాన్ని మనం కూడా దర్శించి మన జన్మలను చరితార్థం చేసుకుందాం.

జై శ్రీమన్నారాయణ

ఒక తెలుగు అభిమాని కవిత

తియ్యటి తెలుగు

పూతరేకులరిసె పూర్ణాలు బొబ్బట్లు
కాకినాడ కాజ కజ్జికాయ
బాదుషాలు జాంగ్రి పాయసమ్ముల కన్న
తీయనైన భాష తెలుగు భాష!

మిసిమి బంగినపల్లి మామిడుల రుచులు
తాటిముంజలు మేటి సీతాఫలాలు
మెరయు చక్కెరకేళి మాధురులకన్న
తీయనైనది నా భాష తెలుగు భాష!

పెసర పిండి పైన ప్రియమగు నల్లంబు
దాని పైన మిర్చి దద్దరిల్ల
జీల కర్ర తోడచేర్చిన ఉప్మాకు
సాటి తెలుగు భాష మేటి భాష

స్వర్గ మందు దొఱకు చప్పని అమృతంబు
తాగ లేక సురులు ధరణి లోన
ఆంధ్ర దేశమందు ఆవిర్భవింతురు
ఆవ కాయ కొఱకు నంగలార్చి.

కూర్మి తోడ తెచ్చి గోంగూర యాకులు
రుబ్బి నూనె మిర్చి ఇంపు తోడ
కారమింగువలను తగిలించి తిను వాడు
ఘనుడు తెలుగు వాడు కాదె భువిని

ఆట వెలది యనిన అభిమానమెక్కువ
తేట గీతి యనిన తియ్య దనము
సీస పద్యమనిన చిత్తమ్ము రంజిల్లు
కంద పద్యమెంత సుందరమ్ము

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

bd

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

'అరుదైన సమాచారం'

'ఈ తరం పిల్లలకు నేర్పించండి. చదివించండి మరియు మనం కూడా మరోసారి మననం చేసుకుందాం.'

దిక్కులు :-
(1) తూర్పు, (2) పడమర, (3) ఉత్తరం, (4) దక్షిణం.

మూలలు :-
(1) ఆగ్నేయం, (2) నైరుతి, (3) వాయువ్యం, (4) ఈశాన్యం

వేదాలు :-
(1) ఋగ్వేదం, (2) యజుర్వేదం, (3) సామవేదం, (4) అధర్వణ వేదం

పురుషార్థాలు :-
(1) ధర్మ, (2) అర్థ, (3) కామ, (4) మోక్షా

పంచభూతాలు :-
(1) గాలి, (2) నీరు, (3) భూమి, (4) ఆకాశం,
(5) అగ్ని.

పంచేంద్రియాలు :-
(1) కన్ను, (2) ముక్కు, (3) చెవి, (4) నాలుక,
(5) చర్మం.

లలిత కళలు :-
(1) కవిత్వం, (2) చిత్రలేఖనం, (3) నాట్యం, (4) సంగీతం, (5) శిల్పం.

పంచగంగలు :-
(1) గంగ, (2) కృష్ణ, (3) గోదావరి, (4) కావేరి,
(5) తుంగభద్ర.

దేవతావృక్షాలు :-
(1) మందారం, (2) పారిజాతం, (3) కల్పవృక్షం, (4) సంతానం, (5) హరిచందనం.

పంచోపచారాలు :-
(1) స్నానం, (2) పూజ, (3) నైవేద్యం, (4) ప్రదక్షిణం, (5) నమస్కారం.

పంచామృతాలు :-
(1) ఆవుపాలు, (2) పెరుగు, (3) నెయ్యి, (4) చక్కెర,
(5) తేనె.

పంచలోహాలు :-
(1) బంగారం, (2) వెండి, (3) రాగి, (4) సీసం, (5) తగరం.

పంచారామాలు :-
(1) అమరావతి, (2) భీమవరం, (3) పాలకొల్లు, (4) సామర్లకోట, (5) ద్రాక్షారామం

షడ్రుచులు :-
(1) తీపి, (2) పులుపు, (3) చేదు, (4) వగరు,
(5) కారం, (6) ఉప్పు.

అరిషడ్వర్గాలు (షడ్గుణాలు):-
(1) కామం, (2) క్రోధం, (3) లోభం, (4) మోహం,
(5) మదం, (6) మత్సరం.

ఋతువులు :-
(1) వసంత, (2) గ్రీష్మ, (3) వర్ష, (4) శరదృతువు,
(5) హేమంత, (6) శిశిర

సప్త ఋషులు :-
(1) కాశ్యపుడు, (2) గౌతముడు, (3) అత్రి, (4) విశ్వామిత్రుడు, (5) భరద్వాజ, (6) జమదగ్ని, (7) వశిష్ఠుడు.

తిరుపతి సప్తగిరులు :-
(1) శేషాద్రి, (2) నీలాద్రి, (3) గరుడాద్రి, (4) అంజనాద్రి, (5) వృషభాద్రి, (6) నారాయణాద్రి, (7) వేంకటాద్రి.

సప్త వ్యసనాలు :-
(1) జూదం, (2) మద్యం, (3) దొంగతనం, (4) వేట, (5) వ్యభిచారం, (6) దుబారఖర్చు, (7) కఠినంగా మాట్లాడటం.

సప్త నదులు :-
(1) గంగ, (2) యమునా, (3) సరస్వతి, (4) గోదావరి, (5) సింధు, (6) నర్మద, (7) కావేరి.

నవధాన్యాలు :-
(1) గోధుమ, (2) వడ్లు, (3) పెసలు, (4) శనగలు, (5) కందులు, (6) నువ్వులు, (7) మినుములు, (8) ఉలవలు, (9) అలసందలు.

నవరత్నాలు :-
(1) ముత్యం, (2) పగడం, (3) గోమేధికం, (4) వజ్రం, (5) కెంపు, (6) నీలం, (7) కనకపుష్యరాగం, (8) పచ్చ (మరకతం), (9) ఎరుపు (వైడూర్యం).

నవధాతువులు :-
(1) బంగారం, (2) వెండి, (3) ఇత్తడి, (4) రాగి, (5) ఇనుము, (6) కంచు, (7) సీసం, (8) తగరం, (9) కాంతలోహం.

నవరసాలు :-
(1) హాస్యం, (2) శృంగార, (3) కరుణ, (4) శాంత, (5) రౌద్ర, (6) భయానక, (7) బీభత్స, (8) అద్భుత, (9) వీర

నవదుర్గలు :-
(1) శైలపుత్రి, (2) బ్రహ్మ చారిణి, (3) చంద్రఘంట, (4) కూష్మాండ, (5) స్కందమాత, (6) కాత్యాయని, (7) కాళరాత్రి, (8) మహాగౌరి, (9) సిద్ధిధాత్రి.

దశ సంస్కారాలు :-
(1) వివాహం, (2) గర్భాదానం, (3) పుంసవనం, (4) సీమంతం, (5) జాతకకర్మ, (6) నామకరణం, (7) అన్నప్రాశనం, (8) చూడకర్మ, (9) ఉపనయనం, (10) సమవర్తనం

దశావతారాలు :-
(1) మత్స్య, (2) కూర్మ, (3) వరాహ, (4) నరసింహ,
(5) వామన, (6) పరశురామ, (7) శ్రీరామ, (8) శ్రీకృష్ణ, (9) బుద్ధ, (10) కల్కి.

జ్యోతిర్లింగాలు :-
హిమలయపర్వతం – కేదారేశ్వరలింగం.
కాశీ – కాశీవిశ్వేశ్వరుడు .
మధ్యప్రదేశ్ – మహాకాలేశ్వరలింగం, ఓంకారేశ్వరలింగం. (2)
గుజరాత్ – సోమనాధలింగం, నాగేశ్వరలింగం. (2)
మహారాష్ట్ర – భీమశంకరం, త్ర్యంబకేశ్వరం, ఘృష్ణేశ్వరం, వైద్యనాదేశ్వరం. (4)
ఆంధ్రప్రదేశ్ – మల్లిఖార్జునలింగం (శ్రీశైలం)
తమిళనాడు – రామలింగేశ్వరం

తెలుగు వారాలు :-
(1) ఆది, (2) సోమ, (3) మంగళ, (4) బుధ, (5) గురు, (6) శుక్ర, (7) శని.

తెలుగు నెలలు :-
(1) చైత్రం, (2) వైశాఖం, (3) జ్యేష్ఠం, (4) ఆషాఢం,
(5) శ్రావణం, (6) భాద్రపదం, (7) ఆశ్వీయుజం, (8) కార్తీకం, (9) మార్గశిరం, (10) పుష్యం, (11) మాఘం, (12) ఫాల్గుణం.

రాశులు :-
(1) మేషం, (2) వృషభం, (3) మిథునం, (4) కర్కాటకం, (5) సింహం, (6) కన్య, (7) తుల, (8) వృశ్చికం, (9) ధనస్సు, (10) మకరం, (11) కుంభం, (12) మీనం.

తిథులు :-
(1) పాఢ్యమి, (2) విధియ, (3) తదియ, (4) చవితి, (5) పంచమి, (6) షష్ఠి, (7) సప్తమి, (8) అష్టమి, (9) నవమి, (10) దశమి, (11) ఏకాదశి, (12) ద్వాదశి, (13) త్రయోదశి, (14) చతుర్దశి, (15) అమావాస్య /పౌర్ణమి.

నక్షత్రాలు :-
(1) అశ్విని, (2) భరణి, (3) కృత్తిక, (4) రోహిణి, (5) మృగశిర, (6) ఆరుద్ర, (7) పునర్వసు, (8) పుష్యమి, (9) ఆశ్లేష, (10) మఖ, (11) పుబ్బ, (12) ఉత్తర, (13) హస్త, (14) చిత్త, (15) స్వాతి, (16) విశాఖ, (17) అనురాధ, (18) జ్యేష్ఠ, (19) మూల, (20) పూర్వాషాఢ, (21) ఉత్తరాషాఢ, (22) శ్రావణం, (23) ధనిష్ఠ, (24) శతభిషం, (25) పూర్వాబాద్ర, (26) ఉత్తరాబాద్ర, (27) రేవతి.

తెలుగు సంవత్సరాల పేర్లు :-

(1) ప్రభవ :-
1927, 1987, 2047, 2107

(2) విభవ :-
1928, 1988, 2048, 2108

(3) శుక్ల :-
1929, 1989, 2049, 2109

(4) ప్రమోదూత :-
1930, 1990, 2050, 2110

(5) ప్రజోత్పత్తి :-
1931, 1991, 2051, 2111

(6) అంగీరస :-
1932, 1992, 2052, 2112

(7) శ్రీముఖ :-
1933, 1993, 2053, 2113

(8) భావ :-
1934, 1994, 2054, 2114

(9) యువ :-
1935, 1995, 2055, 2115

(10) ధాత :-
1936, 1996, 2056, 2116

(11) ఈశ్వర :-
1937, 1997, 2057, 2117

(12) బహుధాన్య :-
1938, 1998, 2058, 2118
13.ప్రమాది :-
1939, 1999, 2059, 2119
14.విక్రమ :-
1940, 2000, 2060, 2120
15.వృష :-
1941, 2001, 2061, 2121
16.చిత్రభాను :-
1942, 2002, 2062, 2122
17.స్వభాను :-
1943, 2003, 2063, 2123
18.తారణ :-
1944, 2004, 2064, 2124
19.పార్థివ :-
1945, 2005, 2065, 2125
20.వ్యయ :-
1946, 2006, 2066, 2126
21.సర్వజిత్తు :-
1947, 2007, 2067, 2127
22.సర్వధారి :-
1948, 2008, 2068, 2128
23.విరోధి :-
1949, 2009, 2069, 2129
24.వికృతి :-
1950, 2010, 2070, 2130
25.ఖర :-
1951, 2011, 2071, 2131
26.నందన :-
1952, 2012, 2072, 2132
27 విజయ :-
1953, 2013, 2073, 2133,
28.జయ :-
1954, 2014, 2074, 2134
29.మన్మథ :-
1955, 2015, 2075 , 2135
30.దుర్ముఖి :-
1956, 2016, 2076, 2136
31.హేవళంబి :-
1957, 2017, 2077, 2137
32.విళంబి :-
1958, 2018, 2078, 2138
33.వికారి :-
1959, 2019, 2079, 2139
34.శార్వారి :-
1960, 2020, 2080, 2140
35.ప్లవ :-
1961, 2021, 2081, 2141
36.శుభకృత్ :-
1962, 2022, 2082, 2142
37.శోభకృత్ :-
1963, 2023, 2083, 2143
38. క్రోధి :-
1964, 2024, 2084, 2144,
39.విశ్వావసు :-
1965, 2025, 2085, 2145
40.పరాభవ :-
1966, 2026, 2086, 2146
41.ప్లవంగ :-
1967, 2027, 2087, 2147
42.కీలక :-
1968, 2028, 2088, 2148
43.సౌమ్య :-
1969, 2029, 2089, 2149
44.సాధారణ :-
1970, 2030, 2090, 2150
45.విరోధికృత్ :-
1971, 2031, 2091, 2151
46.పరీధావి :-
1972, 2032, 2092, 2152
47.ప్రమాది :-
1973, 2033, 2093, 2153
48.ఆనంద :-
1974, 2034, 2094, 2154
49.రాక్షస :-
1975, 2035, 2095, 2155
50.నల :-
1976, 2036, 2096, 2156,
51.పింగళ :-
1977, 2037, 2097, 2157
52.కాళయుక్తి :-
1978, 2038, 2098, 2158
53.సిద్ధార్థి :-
1979, 2039, 2099, 2159
54.రౌద్రి :-
1980, 2040, 2100, 2160
55.దుర్మతి :-
1981, 2041, 2101, 2161
56.దుందుభి :-
1982, 2042, 2102, 2162
57.రుదిరోద్గారి :-
1983, 2043, 2103, 2163
58.రక్తాక్షి :-
1984, 2044, 2104, 2164
59.క్రోధన :-
1985, 2045, 2105, 216
60.అక్షయ :-
1986, 2046, 2106, 2166.

ఈ తరం పిల్లలకు నేర్పించండి. చదివించండి మరియు మనం మరోసారి మననం చేసుకుందాం..

- గంగుల రామాంజనేయులు మాస్టర్

సర్వేషా ఏకాదశి విశిష్టత

- చల్లా జయదేవానందశాస్త్రి

ఏడాదికి 24 ఏకాదశులు. అధిక మాసాలు వచ్చినప్పుడు 26 ఏకాదశులు వస్తాయి. జ్యేష్ఠంలో ఎండలు ఎక్కువగా వుండి భూమిలోని నీటిమట్టాలు చాలా అడుక్కు వెళ్ళిపోతాయి. ఇటువంటి గడ్డు - మండు వేసవిలో వచ్చే ఈ ఏకాదశికి ఎంతో ప్రాముఖ్యత వుంది. భూజలం ఇంకిపోవడం కారణంగా ఈ పర్వదినానికి నిర్జలైకాదశి (ని=అనగా లేదని అని, జల = అనగా నీరు అని అర్థం. జలం లేని కాలంలో వచ్చింది కాబట్టి దీనిని నిర్జలైకాదశి అన్నారు మన పెద్దలు) అని కూడా పిలుస్తారు. జలం లభించని వేసవిలో ఉపవాసం వుండి, పచ్చినీరైనా ముట్టకుండా ఈ పర్వదినాన్ని పాటించిన వారికి ఏడాదిలో వచే&చ 24 ఏకాదశులు నిష్టగా పాటించి ఆచరించిన పుణ్యం కల్గుతుందని స్వయంగా వ్యాసులవారే చెప్పారు. భీమునిచేత వ్యాసులు ఈ దినాన ఉపవాసం చేయించినట్లుగా భారతంలోని అరణ్యపర్వంలో వున్నది.

ఒక్క పూటైనా ఆకలి తట్టుకోలేని భీముడే ఈరోజున ఉపవసించిన కారణంగా దీనికి ప్రాముఖ్యం ఏర్పడింది. జీవితంలో ఒక్కసారైన ఈ ఈ నిర్జలైకాదశిని పాటించినవారికి వైకుంఠ ప్రాప్తి కల్గుతుందని భాగవతం చెబుతున్నది.

చక్రవర్తుల్లో దిలీపుడు - బలి - శిబి - హరిశ్చంద్రుడు - అంబరీషుడు నిర్జలైకాదశిగా పిలువబడే ఈ సర్వేషా ఏకాదశిని ఆజన్మాంతం పాటించినట్లుగా పురాణాలు చెబుతున్నాయి.

Lovely Stay at Holy Tirupathi *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

గమ్మత్తైన పద్యం!

పూర్వం ఒక రామ భక్తుడికి రాముడంటే వల్లమాలిన ప్రేమ. శివుడి పేరు కూడా ఎత్తడు.

ఒకసారి ఓ పండితుడి దగ్గరికి వెళ్లి “రోజూ చదువుకునేలా విష్ణువును గూర్చి ఒక శ్లోకం వ్రాసి ఇవ్వండి” అన్నాడు.

ఆ పెద్దాయనకీ తెలుసు ... ఇతడికి శివుడు అంటే పడదని.

సరే ఒక కాగితం మీద మంచి శ్లోకం ఒకటి వ్రాసి ఇచ్చాడు.

“విష్ణువుని స్తుతిస్తూ వ్రాసాను. మీ విష్ణువు సంతోషిస్తాడు. చదువుకో” అంటూ.

గవీశపాత్రో నగజార్తిహారీ
కుమారతాతః శశిఖండమౌళిః
లంకేశ సంపూజితపాదపద్మః
పాయాదనాదిః పరమేశ్వరో నః

ఆ రామభక్తుడు ఆశ్చర్య పోయాడు చదవగానే.

అందులో ఏమని చెప్పబడింది?

పరమేశ్వరః నః పాయాత్ అని.

అంటే పరమేశ్వరుడు మనలను కాపాడు గాక అని అర్థం .

తక్కిన పదాలన్నీ ఆ పరమేశ్వరునికి విశేషణాలు. అర్థం చూడండి...

గవీశపాత్రః ... గవాం ఈశః గవీశః .... ఆవులకు ప్రభువు అయిన వృషభం. అది వాహనం గా కలవాడు గవీశపాత్రః. అంటే సదాశివుడు.

నగజార్తి హారీ ... నగజ అంటే పార్వతీ దేవి ... ఆవిడ ఆర్తిని పోగొట్టిన వాడూ ... అంటే సాంబశివుడే.

కుమారతాతః .... తాతః అనే సంస్కృత పదానికి తండ్రి అని అర్థం ... కుమారస్వామి యొక్క తండ్రి అయినవాడు శివుడే నిస్సందేహంగా.

శశిఖండ మౌళి: ... అంటే చంద్రవంక శిరసున ధరించిన వాడు ,అంటే శివుడే!

లంకేశ సంపూజిత పాద పద్మః ... లంకాధిపతి అయిన రావణునిచే పూజింపబడిన పాదపద్మములు కలవాడు

అనాదిః ... ఆది లేని వాడూ ... అంటే ఆదిమధ్యాన్తరహితుడు అయినవాడు,

అటువంటి పరమేశ్వరః నః పాయాత్ .... వృషభ వాహనుడూ, పార్వతీ పతి, కుమార స్వామి తండ్రీ, చంద్రశేఖరుడూ, రావణునిచే సేవింప బడిన వాడూ అనాది అయిన పరమేశ్వరుడు మనలను కాచు గాక అనేది తాత్పర్యం.

అర్థం తెలియగానే మతిపోయింది.

వ్రాసిన వాని మీద పిచ్చ కోపం వచ్చింది. అది పట్టుకుని తెగ తిరిగాడు.

చివరికి ఒకాయన “అది విష్ణువుని కీర్తించేదే ... ఏమీ అనుమానం లేదు” అని అతడిని ఓదార్చాడు.

ఇది మరో ఆశ్చర్యం.

అనాది అనే మాటలో ఉంది అంతా. కిటుకు చూడండి ....

పరమేశ్వరుడు ఎలాటివాడూ అంటే అనాదిః అట. అంటే ఆది లేని వాడు. అంటే పరమేశ్వరలో ఆది అక్షరం లేనివాడు.

ఇప్పుడు ఏమయ్యింది? రమేశ్వరః అయ్యింది. అంటే లక్ష్మీపతి అయిన విష్ణువే కదా!

గవీశపాత్రః ... లో గ తీసెయ్యండి .. వీశపాత్రః అవుతుంది. విః అంటే పక్షి అని అర్థం. వీనామ్ ఈశః వీశః ... పక్షులకు రాజు అంటే గరుడుడు, ఏతా వాతా గరుడ వాహనుడైన విష్ణువు.

నగజార్తి హారీ ... మొదటి అక్షరం తీసెయ్యండి .... గజార్తి హారీ ... గజేంద్ర మోక్షణము చేసిన విష్ణువు.

కుమారతాతః .... ఆది అక్షరం తీసేస్తే ... మారతాతః .... మన్మధుని తండ్రి అయిన విష్ణువు.

శశిఖండ మౌళి: ... మొదటి అక్షరం లేకపోతే శిఖండమౌళిః... నెమలిపింఛము ధరించిన విష్ణువు.

లంకేశ సంపూజిత పాద పద్మః ... మళ్ళీ ఆది లేనిదిగా చెయ్యండి ... కేశ సంపూజిత పాద పద్మః ... క అంటే బ్రహ్మ, ఈశః అంటే రుద్రుడు ... అంటే బ్రహ్మ రుద్రేంద్రాదులు బాగుగా పూజించిన పాదపద్మములు కల విష్ణువు.

అతడు మనలను కాపాడు గాక ....

గరుడ వాహనుడూ, గజేంద్రుని ఆర్తిని పోగొట్టిన వాడూ, మన్మధుని తండ్రీ, నెమలి పింఛము దాల్చిన వాడూ, బ్రహ్మ రుద్రాదుల చేత పూజింపబడిన పాద పద్మములు కలవాడూ అయిన రమేశ్వరుడు .... విష్ణువు మనలను కాచు గాక అనే తాత్పర్యం .

ఇప్పటికి అతడు శాంతించాడు.

సమన్వయించుకోకపోతే జీవితాలు దుర్భరం ఔతాయి.

సర్వదేవతలలో విష్ణువుని దర్శించగలిగితే వాడు వైష్ణవుడు.

సర్వ దేవతలలో శివుని దర్శించగలిగితే వాడు శైవుడు.

ఇది మన భారతీయ కవితా వైభవము?

లోకా సమస్తా సుఖినోభవన్తు!

పొడుపు పద్యం!

వండిన దెండిన దొక్కటి
ఖండించిన పచ్చిదొకటి, కాలిన దొకటై
తిండికి రుచియై యుండును
ఖండితముగ దీని తెల్పు కవియుం గలడె? – అజ్ఞాతకవి
(విడమరిచి చెప్పండి మరి)

వండంగ నెండినదొకటి
కండించిన పచ్చిదొకటి కాలిన దొకటై
తిండికి రుచియై యుండును
ఖండితముగ దీని దెల్పు కవియుం గలడే ??

మాతాతగారు చిన్నప్పుడు మమ్మల్ని అడిగిన ప్రశ్న..
వండంగ ఎండినది....వక్క
ఖండించిన పచ్చిదొకటి...తమలపాకు
కాలినదొకటై.....సున్నము..దీన్ని బట్టీలలో కాలుస్తారు.
ఇవి మూడు కలసిన తాంబూలము అవుతుంది. సావే ...??

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
“అజంతా”
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై

SRI RAJARAJESWARI JEWELLERY
The Oldest Jewellery Shop in Pondy Bazaar
81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653
The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation

మైసూర్ వాసుదేవాచార్య

'బ్రోచేవారెవరురా... నినువినా రఘువరా!' ఈ కృతి వినగానే సగటు తెలుగువారికి 'శంకరాభరణం' సినిమా గుర్తుకువస్తుంది. ఖమాస్ రాగంలో, శ్రీ రామాకృతిని ఆ కృతిగా రచించినవారు ఎవరని తెలుసుకొనే ప్రయత్నం చేసినవారు అరుదు.

ఎక్కడో కన్నడదేశంలో మైసూర్లో పుట్టి, త్యాగయ్యగారి శిష్యపరంపరకు చెందిన పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ గారి వద్ద తమిళదేశంలో తిరువయ్యారులో సంగీత విద్యనేర్చి, తెలుగుభాషలో రచనలు చేసిన శ్రీ మైసూర్ వాసుదేవాచార్య రచించిన కృతి అది.

28-5-1865 న, మధ్వ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారాయన. కావ్య, వ్యాకరణ, అలంకార, తర్క, ఇతిహాస, పురాణ, నాటక విద్యలను చిన్ననాటనే అవపోసన పట్టారు. మైసూర్ మహారాజా సంస్కృత కళాశాలలో సంస్కృతభాషను క్షుణ్ణంగా అభ్యసించారు. తమ గురువులు, పరమగురువులు తెలుగుభాషలో రచనలు చేయటంచేత, మక్కువతో తెలుగుభాష నేర్చుకొన్నారాయన. పట్నంవారు, కృతిరచన చేసేటప్పుడు సాహిత్య పరమైన విషయాలను శిష్యులైన వాసుదేవాచార్యులవారితో సంప్రదించి, చేసేవారట!

వాసుదేవాచార్యులవారు సుమారు 200 రచనలు తెలుగు, సంస్కృతభాషలలో చేశారు. వర్ణాలు, కృతులు, కీర్తనలు, రాగమాలికలు, జావళీలు, తిల్లానాలు, శ్లోకాలు రచించారు. రామభక్తి పరాయణులు కావటంతో, వీరి రచనలు ఎక్కువగా రామాంకితాలుగా, 'వాసుదేవ' ముద్రతో ఉంటాయి. త్యాగయ్యగారి బాణిని అనుసరించియుండే వీరి రచనలూ ద్రాక్షాపాకమే. సంగీత మూర్తిత్రయమైన శ్యామశాస్త్రి, త్యాగయ్య, దీక్షితులవార్లను స్తుతిస్తూ, ఆణిముత్యాలవంటి మూడు కృతులు రచించారాయన. వాటిలో కళ్యాణి రాగంలోని 'శ్రీమదాది త్యాగరాజ గురువరం నమామ్యహం' కృతి బహుళ ప్రసిద్ధం.' వాసుదేవ కీర్తన మంజరి' పేరిట, తమ రచనలు పుస్తకరూపంలో నిక్షిప్తం చేయించారాయన. వారు కన్నడంలో వ్రాసిన 'నా కండ కలావిదరు' అనే పుస్తకములో తమకాలంలోని సంగీత విద్వాంసులను గురించి వ్రాశారు. అందులో ఒక ప్రకరణము తన గురువైన 'విద్వద్వాగ్గేయకార' పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ గారిని గూర్చి ఉన్నది.

మైసూర్ మహారాజ ఆస్థాన విద్వాంసునిగా ఆయన గౌరవం అందుకున్నారు. మద్రాసులోని 'కళాక్షేత్ర' లో సంగీత శాఖాధిపతిగా సేవలందించారు.

'పద్మభూషణ్' బిరుదుతో భారతప్రభుత్వం వాసుదేవచార్యులవారిని సత్కరించింది. మద్రాసు మ్యూజిక్ అకాడెమీవారి 'సంగీత కళానిధి' బిరుదాన్ని అందుకున్నారాయన.

సునాదవినోదిని రాగంలో తన రచన 'దేవాదిదేవ! శ్రీవాసుదేవ!' బాలమురళి గళంలో విని, పరవశించి, 'నాకృతికి జీవంపోశావని' ఆయనను మెచ్చుకున్న మహనీయులాయన.

కాంభోజి రాగంలో 'లంబోదరమవలంబే', మోహనరాగంలో 'రారా రాజీవలోచన', ధర్మవతిరాగంలో 'భజనసేయరాదా', ఆభేరిరాగంలో 'భజరే రేమానస', హిందోళ రాగంలో 'మామవతు శ్రీసరస్వతి' ఇత్యాది ప్రసిద్ధరచనలెన్నో చేశారాయన.

95 సంవత్సరాలు జీవించి, సంగీత సరస్వతికి 'కంఠాభరణం'గా వెలుగొంది, 17-5-1961న, వాసుదేవ చరణాలను చేరుకొన్న మైసూర్ వాసుదేవాచార్యులవారికి వినయాంజలి.

– మోదుమూడి సుధాకర్

హిందూత్వమనేది మతం కాదు - మతంలో ముడివేయరాదు!

ఆధ్యాత్మిక తత్వంతో ముడివడిందే హిందూత్వం. దీన్నొక మతంగా మలిచి, భారతదేశం నుంచీ తరిమివేయాలని ఆధునిక (వలసవచ్చిన) పౌరులూ, ఓటుకు కరువు వాచిన రాజకీయనాయకులు చేస్తున్న కుట్రను చూచి జాలిపడ్తున్నాం. వారి హింసా విధానానికీ, హిందూ పరమైన అహింసాతత్వానికీ ఎన్నో ఆమడల దూరం ఉన్నది. హిందూ సాంప్రదాయమైనా, సింధూ నాగరికతయైనా, సనాతన ధర్మం నుంచీ పుట్టినవే! మనకు కానీ, మనకు సంబంధం లేని 'హిందూ' పదాన్ని మనపరంగా చేసుకున్నాం. మనకున్న 'భారత' పదాన్ని హితైష విధానాన్ని మనం మరచిపోతున్నామనడం మన దౌర్భాగ్యానికి ప్రబల నిదర్శనం.

మన ఆధ్యాత్మికతత్వం 'మతం' కాదు. మనం 'హిందూమతం'గా అభివర్ణించు కుంటున్న ధర్మం ఒకరిచే స్థాపింపబడినది కాదు. ఇది దైవదత్తమైనది. మానవతను చిగురింప చేసేది, సంఘంలో సమాజంలో న్యూన్యతా భావాన్ని సడలించి, మాన్యతా భావాన్ని పెంపొందింపచేసేది. ఆంగ్లంలో చెప్పాలంటే 'ఇట్ డీల్స్ విత్ లవ్, ఇట్ డీల్ విత్ సోల్, డీల్సు విత్ బ్రెత్, డీల్స్ విత్ కైండ్‌నెస్, డీల్స్ విత్ లైఫ్' మానవత్వం, ఆత్మ, ప్రాణం, ప్రేమ, దయ, క్షమలతో బ్రతుకు సాంద్రతని పెంచుతూ, అవివేకం, అసత్యం, హింస, బుద్ధి జాడ్యములను రూపుమాపే సమస్త శక్తులూ సనాతన ధర్మంలో ఉన్నాయ్. సనాతన ధర్మస్వరూపమే హిందూత్వం. హిందూత్వం ద్వారా హిందూ దేశంలోని సమస్త సంపదలనూ అనుభవిస్తూ హైందవ సంస్కృతిని కాలరాయాలనే స్వార్థపరులెందరో ఈ దేశంలో పెరిగిపోతున్నారు. నేనూ నా వాళ్లే తక్క నా ఇరుగు పొరుగులో సమస్త ప్రాణులూ జంతు, వృక్ష, పృథ్వీజని తమంతా సుఖ జీవనం సాగించాలనెడి ధ్యాస, అధిక సంఖ్యాకులకు లేకపోవడం ఈనాటి దేశంలోని అస్తవ్యస్త అవస్థలకు కారణమవుతూంది. ఈ అవస్థల్నుంచీ మారాలంటే– ఇప్పుడున్న నాయక శ్రేణి, హైందవ ద్వేషం దృక్పథం మారాలి! సర్వజీవ శ్రేణిని, ప్రేమించే సౌజన్య సౌభాతృత విరాజిల్లాలి. లేనిచో భరత ఖండము ఖండ ఖండములుగా ముక్క ముక్కలుగా విడివడే ప్రమాదం ఉన్నది.

కుర్తాళ శ్రీ సిద్దేశ్వరీ పీఠంలో 75 రోజుల పాటు ధర్మరక్షణ, లోకకల్యాణ యజ్ఞములు...

జగద్గురువులు పూజ్య శ్రీ సిద్దేశ్వరానందభారతీ స్వామి వారి సహస్ర చంద్ర దర్శన లోక కల్యాణ శాంతి మహోత్సవముల అనంతరం, కుర్తాళ శ్రీ సిద్దేశ్వరీ పీఠంలో, శ్రీ స్వామి వారి ఆశీస్సులతో, వారి దివ్య సమక్షంలో ఫాల్గుణ పూర్ణిమ **21** మార్చ్ **2019** గురవారం నుండి వైశాఖ అమావాస్య **3** జూన్ **2019** సోమవారం వరకు **75** రోజుల పాటు ధర్మరక్షణ, లోక కళ్యాణ యజ్ఞములు, పీఠ దేవతలకు ప్రత్యేక పూజలు జరిగాయి.

మహా యజ్ఞ కుండంలో శ్రీ సిద్దేశ్వరీ దేవికి ఏకకాలంలో సహస్ర నారికేళములు, నాడీ గణపతికి, కాళీకాలభైరవులకు సహస్ర నారికేళములు నైవేద్య సమర్పణ జరిగింది. ప్రత్యంగిరా దేవికి సహస్ర కూష్మాండములు నివేదన జరిగింది. పీఠ వ్యవస్థాపకులైన శ్రీ మౌన స్వామికి **121** సార్లు నమక చమకములతో శ్రీ రుద్ర అభిషేకం, నాగదేవతకు ప్రత్యేక పూజలు జరిగాయి.

అధర్మ నివారణకు, ధర్మరక్షణ, దేశరక్షణ కోసం అధర్వణ వేద ప్రత్యంగిరా ఋక్కులతో యజ్ఞం జరిగింది. హనుమంతుని యజ్ఞంలో వేలసంఖ్యలో అరటిపండ్ల నివేదన జరిగింది. నరసింహ జయంతి సందర్భంగా, నారసింహ యాగం జరిగింది. దేశ రక్షణ కోసం అమరులైన సైనికుల కోసం అన్నశాంతి కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమములు శ్రీ సిద్దేశ్వరీ పీఠ పురోహితులు శ్రీ మాచవోలు రమేష్ శర్మ, శ్రీ సిద్దేశ్వరీ పీఠ ప్రధాన అర్చకులు శ్రీ మణికంఠ శర్మ అధ్వర్యంలో జరిగాయి. వివిధ రాష్ట్రములనుండి అధిక సంఖ్యలో వేదవేత్తలయిన బ్రాహ్మణులు శాస్త్రోక్తముగా యజ్ఞములను చేశారు.

శ్రీ సిద్దేశ్వరీ పీఠ ముఖ్య వ్యవరణాధికారి శ్రీ మోచర్ల శశిభూషణ్, అమెరికాలోని శ్రీ సిద్దేశ్వరీ సేవా సంస్థ తరఫున ఈ యజ్ఞ నిర్వహణకు భూరి విరాళాన్ని అందించారు, ఏర్పాట్లను స్వయంగా వచ్చి పర్యవేక్షించారు.

ఈ **75** రోజులపాటు జరిగిన యజ్ఞ ఏర్పాట్లను శ్రీ సిద్దేశ్వరీ పీఠ మేనేజర్ శ్రీ మూర్తి రాజు సమర్ధవంతంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమములలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి ప్రముఖులు, భక్తులు ఎందరో వచ్చి జగద్గురువుల ఆశీస్సులను పొందారు.

వయసి గతే కః కామవికారః శుష్కే నీరే కః కాసారః ।
క్షీణే విత్తే కః పరివారః జ్ఞాతే తత్వే కః సంసారః ॥

వయస్సు మళ్ళిపోతుందని తెలుసు... వార్ధక్యము వస్తుందని తెలుసు... కాయము విడిచివెళ్ళిపోతామని తెలుసు అయినా మనసు కామములు పట్టుకుని విడవదు గోవిందుని పైకి వెళ్ళదు. ధనము ఉన్నంతవరకు స్నేహితులు, పరివారము, బంధువులు బెల్లం చుట్టూ చీమలమాదిరిగా చేరుతారు. అది నిజమైన ప్రేమాభిమానాలని అనుకుంటావు..అది దూరమైతే వీరంతా నీకు తెలియకుండానే దూరమవుతారు ఇందులో ఏది సత్యము ? అయినా గోవిందుని గూర్చి చింతించవు. వయస్సు మళ్ళిపోతే కామవికారాలుండవు. నీరంతా ఇంకిపోయిన తర్వాత సరస్సు ఉండదు. డబ్బు పోయిన తర్వాత పరిచారకులు ఉండరు. అలాగే ఆత్మజ్ఞానం తెలిసి అజ్ఞానం తొలగిపోతే ఇక ఈ జనన మరణ రూప సంసారం అనేది ఉండదు. సూర్యుని రాకతో చీకటి పోయినట్టు జ్ఞానము కలిగితే అజ్ఞానము దానంతట అదే అదృశ్యమవుతుంది అప్పుడు నీకెదురుగా ఉన్నదంతా భ్రమ అని దాని వెనుక ఉన్నది శ్రీహరి అనే సత్యము తెలుస్తుంది.

– భజగోవిందం

జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

సత్యాన్నే అంటిపెట్టుకుని ఉంటే విజయం సాధించగలం.
ఆలస్యమైనప్పటికి విజయం సాధించే తీరుతాం

- స్వామి వివేకానంద

అలుపెరుగని అడుగులతో...

మానవుని సంపూర్ణ ఆయుర్ధాయం 120 సంవత్సరాలు అని శాస్త్రం చెపుతూంది.

60 సంవత్సరాలు నిండినపుడు చేసుకునేది షష్టిపూర్తి.

మనం పుట్టిన తెలుగు సంవత్సరాలు 60 నిండుతాయి, అదే షష్ఠి పూర్తి.

అలా నేనిప్పుడు అరవై పూర్తయ్యినవాడిని.

ఏ ప్రభుత్వోద్యోగంలోను వుండి వుంటే, రెస్టు తీసుకో అని ఇంటికి పంపించేవారు, కాని మనకు రెస్టు అనేది లేదు.

భాధ్యతలున్నాయి కాబట్టి మనకిది రెండో ఇన్నింగ్స్,

అందుకే గోటేటి 2.0

ఇదివరకటి కన్నా వేగంగా పరిగెత్తాలి, ఇదివరకు వున్నంత సమయం ఇప్పుడు లేదు, ఇక వుండదు.

ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు, సంఘర్షణలు ఎదురవుతూ వుంటాయి కాని మన లక్ష్యాలను అందుకోవాలనుకున్నప్పుడు మనల్ని మనం సవాళ్ళకు సంసిద్ధం చేసుకోవాలి.

"ఉప్పెనలో తలవొగ్గక నిలువుగ ఉబికొచ్చేదే జీవితం ఓటమిలో నిట్టూర్చక రివ్వున ఉరికొచ్చేదే జీవితం" - అన్నారు సి నా రే.



అవును 2015 ఉప్పెన వరద నా జీవితంలో నాకొక సవాలు విసిరింది, ప్రెస్ మొత్తం నీళ్ళలో మునిగిపోయింది, మిషినరి, పేపర్ స్టాకు మొత్తం నష్టపోయాను, దానికోసం నిరంతరం శ్రమిస్తూ వున్నాను, నా జీవనాధారం ఆ ప్రెస్సే, దాని ద్వారానే నాకు గౌరవం, పేరు, నాలుగు మంచి కార్యక్రమాలు చెయ్యగలిగానన్నా ఆ గోటేటి గ్రాఫిక్సే కారణం. అక్కడే ప్రముఖాంధ్ర పుట్టుక, తెలుగు భాషకు, తెలుగువారికి ఎంతో కొంత మాకు తెలిసున్నది చెప్పగలిగామంటే ఆ పత్రికే, దేశవిదేశాలలోని తెలుగు వారినందరిని ఆ పత్రిక ద్వారా ఎనలేని తెలుగు సాహిత్యాన్ని , తెలుగు ప్రముఖులను పరిచయం చేసాం. ఆ పత్రిక నిలదొక్కుకోవాలంటే ఆ ప్రెస్ పూర్వ వైభవాన్ని అందుకోవాలి.

ఆ కష్టాన్ని అధిగమించే ప్రయత్నం, ఏటికి ఎదురీదే యత్నం అయినా మా పెద్దాయన 'నాన్న' అడుగడుగున ఇచ్చిన ధైర్యం వల్ల బుల్లి బుల్లి అడుగులేస్తూ వున్నప్పుడు ఆయనా ఆట నాకొదిలిపెట్టి వెళ్ళారు, ఎక్కడికి తరడ్ అంపైర్ దగ్గరికి, ఎందుకు, ఆటలో వాడిని (నన్ను) అవుటవ్వనివ్వకు అంటూ.

అబ్బే నీకు కష్టాలేవిటి అని అందరూ నమ్మరు, కాని స్వామి వివేకానంద "నీవు బాధల్లో వున్నావన సంగతి కుడా ఎవరికీ తెలియనంత నిబ్బరంగా కష్టాలు భరించమని హితవు పలుకుతారు." నేనాయన శిష్యుణ్ణి మరి పాటించాలిగా.

నా ముందు రెండు లక్ష్యాలు, ఒకటి ప్రెస్, రెండోది ప్రముఖాంధ్ర 'నాన్న ప్రాణం', ఆ రెండు నేనున్నంతవరకు వుండాలి.

అందుకే నా 2.0 అలుపెరుగని అడుగులతో మహోత్సవంగా ముందుకు సాగాలని ఆశిస్తూ, అందుకు తగిన మానసిక, శారీరక, ఆర్ధిక శక్తి ఇవ్వమని భగవంతుడిని ప్రార్ధిస్తూ,

మీ ఆశీస్సులు, శుభాకాంక్షలకోసం వేచి చూస్తున్నా.

ఆట ఆడవలసినది నేనైనా, లక్ష్యం పెద్దదైనా స్టేడియంలో అతి పెద్ద ఆటగాడికి ప్రేక్షకుల కేరింతలు, చప్పట్లు, హర్షధ్వానాలు ఎలా ఆ ఆటగాడికి ఎనలేని ఉత్సాహాన్ని, శక్తిని ఇస్తాయో, మీ మంచి మాటలు నాలో ఉత్సాహాన్ని నింపుతాయి.

అంతేకాదు నాన్నగారి స్నేహితులు నన్ను ప్రోత్సహిస్తు నా వెన్నంటి వుంటారని ప్రగాఢ విశ్వాసం

- మీ గోటేటి వెంకటేశ్వరరావు

ప్రముఖాంధ్ర రజతోత్సవ సంచికకు ఎదురుచూడండి

ఈ 2019వ సంవత్సరంలో ప్రముఖాంధ్రకు 24 ఏళ్ళు పూర్తయ్యి 25వ సంవత్సరంలోకి అడుగిడింది. ఈ సందర్భంలో ఒక ప్రత్యేక సంచికను తీసుకురావాలని సంకల్పించాం. శ్రీగోటేటి శ్రీరామారావుగారి మానస పుత్రిక, ఆయన నిరంతరం శ్రమించి వయోభారాన్ని కూడా లెక్కచెయ్యకుండా ఆయన తెలుగువారి పట్ల, తెలుగు భాష పట్ల పడిన తపన, తపః ఫలమే ఈ ప్రముఖాంధ్ర. రజతోత్సవ ప్రత్యేక సంచికకు ప్రముఖాంధ్రుల విశేషాలను త్రిలింగదేశంలో విరాజిల్లిన ధార్మిక సంస్కృతిని, విపులంగా, మే మెరిగినంత విశదంగా, చిత్తరవులతో మీమీ అమూల్య రచనలను, ఈ 24 సంవత్సరాలలో ప్రముఖాంధ్రలో మీరు పొందిన అనుభవాలు పంపించండి. అంతేకాదు మీరు కూడా చందాదారులుగా రూ.2116ను పంపిస్తూ మీరు మరొక్కరిని ఇంకో రూ.2116లను చేర్పించగలరని ఆశిస్తున్నాను. ప్రపంచమంతా ప్రముఖాంధ్రుల మయం కావాలి. ప్రముఖాంధ్ర తేజం ప్రపంచమంతటా వెల్లివెరియాలి.